ప్రజాశక్తి

సోమవారం 26 జూన్ 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

బయోలతో భయోత్పాతం

మార్కెట్‌లోకి నకిలీ ఉత్పత్తులు - కొరవడిన వ్యవసాయశాఖ నియంత్రణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో బయో పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్స్ ముసుగులో అనేక నకిలీ కంపెనీల ఉత్పత్తులు యథేశ్చగా మార్కెట్‌లోకి వస్తున్నాయి. గత కొన్ని ఏళ్లుగా బయో ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ వ్యాపారం జోరుగా సాగుతోంది. దీనిని ఆసరాగా చేసుకొని పలువురు నకిలీ ఉత్పత్తులను మార్కెట్లోకి తీసుకు వస్తున్నారు. అసలు కంపెనీలకు ధీటుగా నకిలీ ఉత్పత్తులతో రైతులను బురిడీ కొట్టిస్తున్నారు. ప్రస్తుతం 100 కంపెనీలకు చెందిన 500 బయో ఉత్పత్తులు మార్కెట్లో ఉన్నాయి. కొన్ని కంపెనీలకు అనుమతి లేకుండానే ఉత్పత్తులను మార్కెట్లో విడుదల చేస్తున్నారు. రాష్ట్రంలో బయో ఉత్పత్తుల విక్రయాలు రూ. 500 కోట్ల వరకు వ్యాపారం జరుగుతోంది. గుంటూరు,పల్నాడు జిల్లాల్లో రూ.200 కోట్ల వరకు బయో నకిలీ ఉత్పత్తుల వ్యాపారం సాగుతోంది. పల్నాడు, గుంటూరు జిల్లాలో వాణిజ్య పంటలు ఎక్కువగా పండించడం వల్ల ఎరువులు, పురుగు మందుల వినియోగం కూడా ఎక్కువగా ఉంటోంది. గుంటూరు పరిసర ప్రాంతాలతో పాటు హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో ఉత్పత్తి అవుతున్న నకిలీ ఉత్పత్తులు ఎక్కువగా గుంటూరు, పల్నాడు జిల్లాలకు వస్తున్నాయి. నకిలీ బయో పెస్టిసైడ్స్ వినియోగం వల్ల పంటలు దెబ్బతింటున్నాయి. బయో ఉత్పత్తుల్లో ఎక్కువగా జిబ్రా లిక్ యాసిడ్ కలపడం వల్ల కాపు ఏపుగా పెరిగినా దిగుబడి రాని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పంట నాణ్యత కూడా తగ్గుతుంది. క్రిమి సంహారక మందులు, ఎరువుల నియంత్రణ చట్టాల పరిధిలోకి బయో ఉత్పత్తులు రావని కొన్ని కంపెనీల వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించి తమ ఉత్పత్తుల విక్రయాన్ని నిరాటకంగా కొనసాగిస్తున్నారు. బయో ఉత్పత్తుల వినియోగం వల్ల భూమిలో భూసారం తగ్గి చౌడు భూములుగా మారతాయి. పర్యావరణానికి హాని కలుగుతుంది పురుగుమందుల అవశేషాలు గాలిలో కలిసి వాయుకాలుష్యం ఏర్పడుతుంది. ఇందువల్ల ప్రజారోగ్యం దెబ్బతింటుంది. ఒక కంపెనీపై ప్రభుత్వం చర్యలు తీసుకోగా పేరు మార్చి పరిసరాల్లోనే మరో కంపెనీని ప్రారంభించడం బయో ఉత్పత్తుల తయారీదారులకు పరిపాటిగా మారింది. విజిలెన్సు, వ్యవసాయ శాఖ, పోలీసు అధికారులు అడపాదడపా దాడులు చేస్తున్నా పూర్తిస్థాయిలో నిరోధించలేకపోతున్నారు. గ్రామాల్లో ఎరువులు, పురుగుమందుల దుకాణాల వారు రైతుల ఆర్థిక బలహీనతలను ఆసరాగా చేసుకుని డిఎపి, యూరియా కొనుగోలు సమయంలో బయోలు కూడా కొనుగోలు చేయాలని షరతు పెడుతున్నారు. బయో కంపెనీలు ఇచ్చే బంపర్ ఆఫర్లతో వ్యాపారులు రైతులకు వీటిని ఇట్టే అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారు. అప్పులు చేసి ఎరువులు, పురుగు మందులు తీసుకునే వారికి వీటిని పూర్తిస్థాయిలో అంటగడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. వీటి నియంత్రణకు చట్టం చేయాలని గతంలో హైకోర్టు సూచించినా ప్రభుత్వం ఇంత వరకు తగిన చర్యలు తీసుకోలేదు.

సమావేశంలో మాట్లాడుతున్న కెఎస్‌ఎస్ ప్రసాద్, వేదికపై ఇతర నాయకులు

పథకాలే కాదు.. ఉపాధ్యాయులూ కావాలి..

- ఖాళీలు భర్తీ చేస్తేనే ప్రభుత్వ విద్య బలోపేతం
- యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్‌ఎస్ ప్రసాద్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా కరస్పాండెంట్

నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలుగా తీర్చిదిద్దామని, విద్యార్థుల సౌకర్యం కోసం సకల సౌకర్యాలు ఏర్పాటు చేశామని చెబుతున్న ప్రభుత్వం ఉపాధ్యాయుల కొరతను అధిగమించడంలో విఫలమైందని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. స్థానిక పల్నాడు రోడ్డులోని మున్సిపల్ బాలుర పాఠశాలలో ఆదివారం యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశానికి యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్ అధ్యక్షత వహించారు. కెఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ పేద విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలంటే ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలన్నారు. అమ్మఒడి, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద వంటి పథకాలున్నా ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది ప్రవేశాలు ఆశాజనకంగా లేవని, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు గణనీయంగా పెరిగాయని తెలిపారు దీనికి కారణం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతతో తమ పిల్లలకు నాణ్యమైన విద్య అందదని తల్లిదండ్రులు భావించడమేనన్నారు. ఆకర్షణీయమైన పథకాలతో పాటు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు నియమించి కొరత లేకుండా చూసినప్పుడే ప్రభుత్వ విద్యా రంగం బలపడుతుందన్నారు. జీవో 117 పేరిట ప్రభుత్వ పాఠశాలల విలీనం చేయడం వలన విద్యార్థులకు పాఠశాలల దూరమై కొందరు పేద విద్యార్థులు బడికి దూరం అవుతున్నారన్నారు. ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ కోసం ఉపాధ్యాయులతో పాటు మేధావి వర్గం కూడా కషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రమోషన్లు ఇస్తూ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల పోస్టులు రద్దు చేయడం ఏ మాత్రం హర్షణీయం కాదని చెప్పారు. ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అనేక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఖాళీలు ఏర్పడ్డాయని, వాటిని భర్తీ చేయాలని కోరారు. బదిలీ కాబడి రిలీవర్ లేక రిలీవ్ కాని వారిని వెంటనే రిలీవ్ చేయాలని చెప్పారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జి.విజయసారథి మాట్లాడుతూ బదిలీల ద్వారా ఉత్పన్నమైన అనేక సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు.

2లో

విద్యుత్ ప్రమాదాల నివారణకు కృషి

- వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- విద్యుత్ అక్రమ వినియోగదార్లపై కేసులు
- ప్రజాశక్తితో జిల్లా విద్యుత్ విజిలెన్స్ అధికారి కరుణాకరరావు

8లో

రాష్ట్రంలో బీసీలకు రక్షణ లేదు

వార్త మెయిన్‌లో

గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణలో సినీనటుడు సుమన్

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందాం

యుటిఎఫ్ కరపత్రం ఆవిష్కరణలో నాయకులు

2లో

3న పంచాయతీరాజ్ కమిషనరేట్ ముట్టడి

వార్త మెయిన్‌లో

సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు పాపయ్య

కన్నా, అంబటి పరస్పరం విమర్శలు

2లో

వార్తలు లోపలి పేజీల్లో

తాడేపల్లిలో విద్యుత్ బిల్లు ప్రతులను దహనం చేస్తున్న పాశం రామారావు తదితరులు

మాచర్లలో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న గుంటూరువిజయ్‌కుమార్ తదితరులు

వామ్మో.. విద్యుత్ బిల్లులు

సిపిఎం నాయకుల ఎదుట ప్రజల ఆవేదన - పోరాటాల్లో కలిసి రావాలని పిలుపు

సభలో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మీ లావణ్య

సైడ్ ఎఫెక్ట్స్ లేని చికిత్స ఫిజియోథెరపి

ప్రజాశక్తి-గుంటూరు

మానసికంగా, శారీరకంగా కృంగిపోయే రోగుల వికాసానికి సంజీవిని వలే స్వాంతన చేకూర్చే ఫిజియోథెరపి ఏ విధమైన సైడ్ ఎఫెక్ట్ లేని శారీరక వైద్యమని సీనియర్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ యం.లక్ష్మీలావణ్య అన్నారు. ఆదివారం అవగాహన ఆధ్వర్యంలో స్థానిక అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో ఫిజియోథెరపి దంత సమస్యలపై ఆరోగ్య సభ నిర్వహించారు. డాక్టర్ లావణ్య మాట్లాడుతూ ఎలాంటి మందుల ప్రమేయం లేని చికిత్స ఫిజియోథెరపి అని, శారీరకంగా వచ్చే నొప్పిని నివారించటానికి అధునాతన పరికరాలతోపాటు కండరాలు, కీళ్లు, నరాల సామర్థ్యాన్ని పెంచటానికి ఎక్సర్‌సైజుల ద్వారా ఈ వైద్య విధానంలో చికిత్స చేయబడుతుందన్నారు. వివిధ రకాల శస్త్ర చికిత్సల అనంతరం రోగుల జీవన విధానం మెరుగుపర్చటంలో ఈ ఫిజియోథెరపి ముఖ్యపాత్ర వహిస్తుందన్నారు. పక్షవాతం, మెడనొప్పి, నడుంనొప్పి, మోకాళ్ల నొప్పి, భుజం నొప్పి, వెన్ను సమస్యలకు నరాల బలహీనతలకు ఫిజియోథెరపి ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. దంత వైద్యులు డాక్టర్ టి.హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దంతాల ప్రాముఖ్యత, చికిత్స గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. దంతాలు దెబ్బతినటానికి దంతక్షయం, చిగుళ్ల సమస్యలు ముఖ్య కారణాలన్నారు. గట్టిపళ్లు ఉన్న వారికి ఏదైనా పన్ను దెబ్బతింటే ఫిక్స్‌డ్ పళ్లు అమర్చగలమని, పెద్ద వారికి అయితే వారి పళ్ల గట్టి తనాన్నిబట్టి ఇంప్లాంట్ టెక్నాలజీ ద్వారా ఎముకల ఆధారంగా పళ్లను అమర్చుతారన్నారు. సభలో డాక్టర్ లావణ్య, హర్షవర్ధన్‌రెడ్డిని అవగాహన సభ్యులు సన్మానించారు.

కార్డుల పంపిణీలో ఉపకమిషనర్ శివప్రసాద్

అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసమే ఈశ్రమ్ కార్డులు

ప్రజాశక్తి-తెనాలి

అసంఘటిత రంగ కార్మికుల ప్రయోజనార్ధమే ఈ-శ్రమ్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు కార్మిక శాఖ ఉప కమిషనర్ డి.వి.శివప్రసాద్ చెప్పారు. స్థానిక సుల్తానాబాద్‌లోని రత్నాఫార్చ్యూన్ కళ్యాణ మండపంలో మా ఎపి ఆధ్వర్యంలో ఈ-శ్రమ్ కార్డుల పంపిణీలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఈ-శ్రమ్ కార్డుతో ఎన్నో ప్రయోజనాలున్నాయన్నారు కార్మికులు ప్రమాదవశాత్తూ మరణిస్తే కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల బీమా అందజేస్తారన్నారు. అనేక ప్రయోజనాలున్న ఈ-శ్రమ్ కార్డులను అర్హులైన ప్రతి ఒక్కరూ పొందాలన్నారు. విశిష్టఅతిథిగా పాల్గొన్న డాక్టర్ పువ్వాడ యశోధర మాట్లాడుతూ సినిరంగంలో వివిధ విభాగాల్లో కార్మికులతో పాటు, 235 మంది అసంఘటిత రంగ కార్మికులు ఈ-శ్రమ్ కార్డులు పొందేలా అవగాహన కల్పించిన మా ఎపి వ్యవస్థాపకలు దిలీప్‌రాజాను అభినందించారు. అనంతరం కార్మిక శాఖ సహాయక కమిషనర్ ఎం.వినయ్‌కుమార్, దిలీప్‌రాజా మాట్లాడారు. మిలటరి ప్రసాద్, మహబూబ్ సుభాని, శ్యామవీర, బి.వెంకట్, శివన్నారాయణ, పార్ధసారధి, సాయిలత, శివశంకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందాం

యుటిఎఫ్ కరపత్రం ఆవిష్కరణలో నాయకులు

కరపత్రం ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం ఉపాధ్యాయులు ఆవాస ప్రాంతాల్లో తిరిగి, తల్లిదండ్రుల్ని కలిసి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా యుటిఎఫ్ కార్యకర్తలు, ఉపాధ్యాయులు క్యాంపెయిన్ నిర్వహించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ ఉపాధ్యాయుల్ని కోరారు. ఆదివారం బ్రాడీపేటలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో 'ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం' కరపత్రాన్ని సంఘ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యుటిఎఫ్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా జిల్లా, మండల కమిటీల సభ్యులు, ఉపాధ్యాయులు ఈ కారక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ ఉన్నత విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులు ఉండి, సహజ సిద్ధమైన వాతావరణంలో మనోవికాసం అభివృద్ధితో కూడిన విద్య ప్రభుత్వ పాఠశాలలకే సాధ్యమని అన్నారు. బడిని కాపాడుకునే పనిని తల్లిదండ్రులతో కలిసి ఉపాధ్యాయులు స్వీకరిస్తే ప్రభుత్వ బడికి ప్రత్యామ్నాయం ఉండదని అన్నారు. కావున ఈ క్యాంపెయిన్‌లో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు సిహెచ్. ఆదినారాయణ, జి.వెంకేటశ్వరరావు, యం.గురుబ్రహ్మం, కె.ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కన్నా, అంబటి పరస్పర విమర్శలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణపై ఆదివారం రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన ఆరోపణలకు కన్నా కౌంటర్ ఇచ్చారు. అంబటి సత్తెనపల్లిలో మీడియాతో మాట్లాడుతూ సిఎం జగన్‌పై కన్నా లేనిపోని ఆరోపణలు చేస్తే సహించం అన్నారు. చంద్రబాబును తిట్టినట్టు జగన్‌ను తిడితే తగిన శాస్తి చేస్తామన్నారు. సిఎం జగన్ గురించి కన్నా అవాకులు, చవాకులు మాట్లాడటం మానుకోవాలన్నారు. చంద్రబాబును తిట్టి ఆయన ఫోటోలకు ఇప్పుడు పాలభిషేకాలు చేస్తున్న కన్నాకు రాజకీయ విలువలుఉన్నాయా అని ప్రశ్నించారు. రాజారెడ్డి,రాజశేఖర్ రెడ్డి, జగన్ ను విమర్శించే హక్కు కన్నాకు లేదన్నారు. సత్తెనపల్లి లో టిడిపికి కన్నా ఇంచార్జ్ మాత్రమే..వచ్చే ఎన్నికల్లో పోటీచేస్తాడో పారిపోతాడో తెలీదన్నారు. కన్నా సంగతి బిజీపి పార్టీ చేబుతుందన్నారు. బిజెపి ఎన్నికల ఖర్చు కోసం ఫండ్ పంపితే మింగిన ఘనత కన్నాదని అంబటి ఆరోపించారు. కన్నా సంగతి అమిత్ షా బాగా చెబుతాడని అన్నారు. కన్నా సంగతి గుంటూరు కన్నా వారి తోటలో ప్రజలు చెబుతారు ఆయన ఇంటిముందు ఫ్లెక్సీలు చెబుతాయన్నారు.

అంబటి చిల్లర మనిషి : కన్నా

మంత్రి అంబటి వ్యాఖ్యలపై కన్నా లక్ష్మీనారాయణ స్పందిస్తూ జగన్మోహన్ రెడ్డి చేస్తున్న అరాచకాలు ప్రశ్నించినందుకు తనను బిజెపి అధ్యక్ష పదవి నుంచి దించాలని కుట్ర పన్నారని ఆరోపించారు. బిజెపిలో ఎన్నికల ఫండ్ దుర్వినియోగం అయిందని పత్రికల్లో వార్తలు రాయించారని తెలిపారు.అంబటి చిల్లర మనిషి అనిఆయన వ్యాఖ్యానించారు. తాను మొదటినుంచి ఆర్థిక లావాదేవీలకు దూరంగాఉన్నానని తెలిపారు. 2019 ఎన్నికల్లో ఐదుగురు సభ్యుల పర్యవేక్షణలో ఎన్నికల ఖర్చుపెట్టామన్నారు. కేవలం వైసిపి రాక్షస పాలన అంతం చేయటం కోసమే టిడిపిలో చేరానని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి సోనియాగాంధీని పొగిడింది ఆ తర్వాత తిట్టింది మర్చిపోయారా అని ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకుడిగా కాపులకు రిజర్వేషన్ అంశం రాష్ట్ర పరిధిలో లేదని కేంద్రం పరిధిలో ఉందని చెప్పి వైఎస్ జగన్ మోసం చేశారని లక్ష్మీనారాయణ ఆరోపించారు. 2019 తరువాత ఈ అంశం రాష్ట్ర పరిధిలోకి తీసుకువస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్నా ఇంతవరకు సిఎం జగన్ స్పందించలేదన్నారు. ముద్రగడ ఎప్పుడూ ఏ పని చేసినా తన వ్యక్తిగత ప్రాబల్యం కోసమేనని వ్యాఖ్యానించారు. ముద్రగడ మంత్రిగా ఉన్నప్పుడు కులం గురించి మాట్లాడ వద్దని నాతో చెప్పాడని తెలిపారు. తన రాజకీయ ప్రాబల్యం తగ్గిపోతుందని భావించినప్పుడు ముద్రగడ ఇలా ఇలా ముందుకు వస్తారని అన్నారు. కాపులను బీసీల్లో చేర్చే ప్రక్రియ చేపట్టింది చంద్రబాబు అని ఆయన గుర్తు చేశారు. కాపు రిజర్వేషన్ల అంశంలో ద్రోహి జగన్మోహన్ రెడ్డి అని ధ్వజమెత్తారు. ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లలో ఐదు శాతం చంద్రబాబు కాపులకు ఇచ్చారని తెలిపారు.

పేద విద్యార్థులకు రూ.2లక్షలు స్కాలర్‌షిప్‌లు

ప్రజాశక్తి-గుంటూరు

సమాజంలో ప్రతిభ గల పేద విద్యార్థులను అందరూ ప్రోత్సహించాలని మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. అమరావతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చంద్రమౌళి నగర్ భాష్యం స్కూల్లో విశ్రాంత ప్రిన్సిపాల్ నూతలపాటి తిరుపతయ్య అధ్యక్షతన ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యావంతులను సమాజం గౌరవిస్తుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని పిల్లలు ఉన్నత స్థాయికి చేరుకోవాల న్నారు. కొండవీటి నరసింహారావు పేద విద్యార్థులకు చేస్తున్న సాయం అభినందనీయమన్నారు. భాష్యం విద్యా సంస్థల అధినేత రామకృష్ణ మాట్లాడుతూ పిల్లలు లక్ష్యాలను నిర్ధేశించుకొని, దానికి అనుగుణంగా ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. చదువుకు పేదరికం అడ్డుకాదన్నారు. అమరావతి ఫౌండేషన్ చైర్మన్ కొండవీటి నరసింహారావు మాట్లాడుతూ విద్యాభ్యాసం పెరిగితే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ విశ్రాంత ఓఎస్‌డి ప్రొఫెసర్ శామ్యూల్, ఆంధ్రాబ్యాంకు విశ్రాంత మేనేజర్ పెద్ది సాంబశివరావు, తాళ్ల వెంకటేష్ యాదవ్, డిసిఎంఎస్ విశ్రాంత అధికారి ఇన్నయ్య తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా 40 మంది విద్యార్థులకు రూ.5వేల చొప్పున రూ.2లక్షల ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. తెలంగాణాలో 10వ తరగతి స్టేట్ ఫస్ట్, జూనియర్ ఇంటర్‌లో స్టేట్ ఫస్ట్ సాధించిన గుంటూరు జిల్లాకు చెందిన కొండవీటి మన్విని, మొదటి సంవత్సరం వైద్య విద్యలో గోల్డ్ మెడల్ సాధించిన కొండవీటి హేమ సింధూరను భాష్యం రామకృష్ణ, కన్నా లక్ష్మీనారాయణ శాలువాతో సన్మానించారు.

స్కాలర్‌షిప్‌లు అందచేస్తున్న కన్నా లక్ష్మీనారాయణ, భాష్యం రామకృష్ణ, తదితరులు

భవిష్యత్ గ్యారంటీ బస్సు యాత్ర

ప్రజాశక్తి - దాచేపల్లి

గురజాల నియోజకవర్గం పరిధిలో ఈ నెల 28న గురజాల నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలోలి చేపట్టనున్న భవిష్యత్తు గ్యారెంటీ బస్సు యాత్రను విజయవంతం చేయాలని టిడిపి నేతలు ఆదివారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా దాచేపల్లి మండల అధ్యక్షులు బెల్లం కొండ చంద్రశేఖర్ బద్రి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 28న పిడుగురాళ్ల పట్టణం, కొండమోడు కిట్కో ఇల్లు దగ్గర నుంచి ప్రారంభమై బ్రాహ్మణపల్లి వరకు బస్సుయాత్ర జరుగుతుందన్నారు. జాతీయ క్రమశిక్షణ సభ్యులు జి.నాగేశ్వరరావు, గురజాల నియోజకవర్గ అధికార ప్రతినిధి పుల్లయ్య పాల్గొన్నారు.

'నిండైన జీవితం ఓ వరం'

ప్రజాశక్తి - తెనాలి

నూరేళ్ల నిండైన జీవితం అరుదుగానే దక్కుతుందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెని క్రిష్టినా అన్నారు. మండలంలోని కొలకలూరులో ఇటీవల మృతి చెందిన శతాధిక వృద్ధురాలు ఉన్నం ఆనందమ్మ సంస్మరణను ఆమె కుటుంబ సభ్యులు ఆదివారం నిర్వహించారు. సభలో పాల్గొన్న క్రిస్టీనా, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, వైసిపి తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ తొలుత ఆనందమ్మ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కుటుంబాన్ని ఎంతో క్రమశిక్షణగా నడిపించిన ఆమె జీవితం సమాజానికే ఆదర్శమని వారు కొనియాడారు. కార్యక్రమంలో ఆనందమ్మ కుమారుడు, కర్నూలు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ ఉన్నం యెహెస్కేలు, వి.రాజ్‌కుమార్, వి.లక్ష్మయ్య, సీనియర్ ఎపిపిలు ఎస్.సుకుమార్, పి.సునీల్, గుంటూరు, నర్సారావుపేట ఎపిపిలు మురళి, విజయ్ కుమార్, ఎస్.మురళీధర్, వైసిపి రాష్ట్ర నాయకులు ఎస్.నాగరాజు, వ్యవసాయ శాఖ ఏడిలు అమలకుమారి, ప్రవీణ, జాస్మీన్, విజయవాడ ఆర్టీసి డిప్యూటీ డిజిఎం (ఫైనాన్స్) సుధాకర్, విశ్రాంత తహసీల్దార్ రామారావు, విశ్రాంత పంచాయతీ రాజ్ అధికారి యోహాను పాల్గొన్నారు.

27, 30 తేదీల్లో సాంస్కృతిక సమ్మేళనం

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

యువతను చైతన్య పరిచేందుకు ప్రజానాట్యమండలి కళాకారులు కళారూపాలను ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ఎ.రామారావు అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయం వద్ద ఆదివారం జరిగిన కళాకారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 27-30 తేదీల్లో గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించే సాంస్కృతిక సమ్మేళనంలో కళాకారులు అధికంగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమానికి ప్రముఖ వాగ్గేయ కళాకారులు గోరేటి వెంకన్న. ప్రముఖ సినీ సంగీత దర్శకులు, గాయకులు వందేమాతరం శ్రీనివాస్, 'మా' అసోసియేషన్ ఉపాధ్యక్షులు మాదాల రవి, ఎఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.తిరుమలై రామన్, అధ్యక్షులు సుబ్బిందర్ మహేతరి పాల్గొంటారని చెప్పారు.

పథకాలే కాదు.. ఉపాధ్యాయులూ కావాలి..

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు తప్పిదాల వల్ల ఉపాధ్యాయులు నష్టపోవడం బాధాకరమన్నారు. అప్ గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాలలకు డిడిఒ కోడ్‌లు ఇచ్చి ఈ నెలలో వేతనాల సమస్యలు రాకుండా చూడాలని కోరారు. జిల్లా కేంద్రంలో నిర్మించనున్న యుటిఎఫ్ జిల్లా కార్యాలయ నిర్మాణానికి అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో జిల్లా కోశాధికారి జె.వాల్యా నాయక్, కార్యదర్శులు కె.శ్రీనివాస్‌రెడ్డి, సహాధ్యక్షులు ఎం.మోహన్‌రావు, ఎ.భాగేశ్వరిదేవి, జిల్లా కార్యదర్శి ఆర్.అజయ్ కుమార్, ఎం.రవిబాబు, అయేషా సుల్తానా, కాంతారావు, టి.వెంకటేశ్వర్లు, చిన్నం శ్రీనివాసరావు, కె.తిరుపతి స్వామి, ఎ.శ్రీనివాసరావు, శేషగిరి, షేక్ కాసింపీరా, యు.రాజశేఖర్‌రావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.విజయకమల పాల్గొన్నారు.

వేర్వేరుచోట్ల విద్యుత్ తీగలు తగిలి గేదెలు మృతి

విద్యుత్ శాఖ అధికారులపై అన్నవరం గ్రామస్తులు ఆగ్రహం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా కరస్పాండెంట్

మృతి చెందిన గేదె

విద్యుత్ తీగలు తగిలి గేదె మృతి చెందిన సంఘటన రొంపిచర్ల మండలంలోని అన్నవరం గ్రామంలో ఆదివారం జరిగింది. దీనికి సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆ గ్రామానికి చెందిన తిరువీధుల వెంకయ్య కు చెందిన గేదె మధ్యాహ్నం సమయంలో పొలాల్లో గడ్డి మేస్తుంది. ఆ సమయంలో పొలాల్లో పడిపోయిన విద్యుత్ తీగలు తగలటంతో షాక్ కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. పొలాల్లో విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ఉండి క్రిందకు వేలాడుతున్నాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఈ సంఘటన జరిగిందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తీగెలు కిందకు జారి ఉండడం గురించి విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా వారు పట్టించుకోలేదని ఆరోపించారు. మృతి చెందిన గేదె విలువ రూ 1 లక్ష వరకు ఉంటుందని బాధితుడు వెంకయ్య తెలిపారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వలనే తన గేదె మృతి చెందిందని తనకు న్యాయం చేయాలని కోరారు.

కిందకు జారిన విద్యుత్ తీగెలు

ఈపూరు సమీపంలో ..

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్రమైన ఈపూరు గ్రామ సమీపంలో రాపర్ల వారి చెరువు వద్ద విద్యుత్ తీగలు తాకడంతో మూడు గేదెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన కొంగా వెంకయ్య, కంచర్ల ప్రసన్నలక్ష్మి, కంచర్ల వీరాంజి లకు చెందిన గేదెలను మేత కోసం పొలం తోలారు. పంట పొలాల వైపు వెళ్తున్న గేదెలు వ్యవసాయ బోరు మోటార్ల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్ తీగలు తెగి కింద పడటంతో అవి తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. లైన్ మెన్ రమణానాయక్ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. చనిపోయిన గేదెల విలువ రూ. 1.50 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి-అచ్చంపేట

బోల్తా కొట్టిన కారు

మృతుడు నాగ మల్లేశ్వరరావు

కారు ఢీకొని కొత్తపల్లి గ్రామానికి చెందిన మోదుగుల నాగమల్లేశ్వరరావు (54) మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. కొత్తపల్లి గ్రామానికి చెందిన నాగ మల్లేశ్వరరావు రోడ్డు వెంబడి ఉన్న రోలుపై కూర్చుని ఉన్నాడు. ఎర్రగొండపాలెంకు చెందిన కారు సత్తెమ్మ తల్లి గుడి వద్ద నుండి అచ్చంపేట వైపు వస్తోంది. కారులోని యువకులు అతిగా మద్యం సేవించి రోడ్డు పక్కన కూర్చొని ఉన్న నాగమల్లేశ్వరరావును ఢీ కొట్టారు. దీంతో కారు అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో నాగమల్లేశ్వరరావు మృతి చెందాడు. యువకులు కారు వదిలి పరారయ్యారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు.

దాడికి పాల్పడ్డ యువకులు అరెస్ట్

ప్రజాశక్తి - తాడికొండ

దళితుల పై జరిగిన దాడి ఘటనలో నిందితులను ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. మండల పరిధిలోని కంతేరు గ్రామంలో గురువారం ఎస్సి యువకులకు, రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వైసీపి యువకులకు మధ్య మాట మాట పెరిగి వివాదానికి దారి తీసింది. ఈ కోట్లాటలో ముగ్గురు దళిత యువకులకు తీవ్రంగా గాయాలయ్యాయు. దళితులకు జరిగిన అన్యాయం పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాలు తాడికొండ పోలీస్ స్టేషన్ ముందు ధర్నా చేశారు. శనివారం కంతేరు గ్రామంలో డిఎస్పీ పోతురాజు భాదితులను విచారించారు. ఆదివారం కంతేరు గ్రామంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చెకోపోస్టులు ఏర్పాటు చేసి బందోబస్తు నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దాడికి పాల్పడిన వారిలో ఆరుగురు నిందితులు అయిన కళ్ళం మనోహర్ రెడ్డి, జొన్నల సందీప్ రెడ్డి, అన్నపురెడ్డి సాయికష్ణ కుంటి నాగేంద్ర బాబు, భీమవరపు మణిదీప్ రెడ్డి, ధరణికొండ నరసింహారావు లను మంగళగిరి నార్త్ డిఎస్పీ జయ రాంబాబు ఆధ్వర్యంలో గుంటూరు స్పెషల్ కోర్టు నందు హాజరు పరిచారు. దాడికి పాల్పడిన వారిలో కళ్ళం మనోహర్ రెడ్డి, జొన్నల సందీప్ రెడ్డి, అన్నపురెడ్డి సాయికష్ణ భీమవరపు మణిదీప్ రెడ్డి, ధరణికొండ నరసింహారావు లపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. కురాటి నాగేంద్ర బాబు పై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

ఎఇఎల్‌సి చర్చిలో పాస్టర్ పై దాడి

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణంలోని అంబేద్కర్ కాలనీ ఎఇఎల్‌సి చర్చిలో ఆదివారం రెవరెండ్ పాస్టర్ ఎన్.వెంకటరత్నంపై దాడి జరిగింది. వివరాల్లోకి వెళితే 2020- 25 ఆంధ్ర లూథరన్ ఇవాంజెలికల్ చర్చి తూర్పు గుంటూరు అధ్యక్షుడు కనపర్తి ఆశీర్వాదం ఉత్తర్వుల మేరకు ఎన్ .వెంకటరత్నం ను పొన్నూరు మండలం మాచవరం నుండి అంబేద్కర్ కాలనీకి బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో వెంకటరత్నం ఆదివారం విధులు నిర్వర్తించేందుకు చర్చిలోకి వెళ్ళగా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న పాస్టర్ టైటాస్ దేవకుమార్ ,పాస్టర్ మిక్కిలి పాల్ ప్రసాద్ కొందరు అనుచరులతో కలిసి ఆయనపై, భార్యపై దాడి చేసి బయటకు గెంటివేశారు. అనంతరం వెంకటరత్నం తన భార్యతో కలిసి ఆశీర్వాదానికి ఫిర్యాదు చేశారు. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసానని ఆయన హామీ ఇచ్చారు.పొన్నూరు అర్బన్ పోలీ సులు సమా చారం అందుకొని అంబేద్కర్ కాలనీలోని చర్చి వద్దకు వెళ్లి పరిస్థితిని శాంతింపజేశారు. పికెటింగ్ ఏర్పాటు చేశారు. గతంలో కూడా పాత పొన్నూరు ఎఇఎల్ సి చర్చి పాస్టర్ల బదిలీ విషయమై పెద్ద ఎత్తున ఘర్షణలు జరిగి వారాలు తరబడి పికెటింగ్ ఏర్పాటు చేసిన ఘటనలు ఉన్నాయి.

జూదరులు అరెస్ట్

ప్రజాశక్తి-తెనాలి

పేకాట స్థావరంపై పట్టణ త్రి టౌన్ పోలీసులు దాడి చేశారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సుల్తానాబాద్ ప్రాంతం, నవోదయ కళ్యాణమండపం ఎదురుగా ఓ ఖాళీ గృహంలో పేకాడుతున్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. అక్కడ పేకాడుతున్న పదిమంది జూదరులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ. 72,050ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. దాడుల్లో ఎస్ఐ విజయ్ కుమార్ బందం పాల్గొన్నారు.

ఆలోకం వెంకాయమ్మ సేవలు నిరుపమానం

ప్రజాశక్తి - యడ్లపాడు

నేత్రదానం చేసిన ఆలోకం వెంకాయమ్మ సేవలు నిరుపమానమని సినీనటుడు చిట్టినేని లక్ష్మీ నారాయణ అన్నారు. మండలంలోని లింగారావుపాలెంకు చెందిన ఆలోకం వెంకాయమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా స్థానిక కల్యాణ మండపంలో ఆదివారం నిర్వ హించిన సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. ఆదర్శ భావాలు, సేవా గుణం మెండుగా ఉన్న వెంకాయమ్మ సేవలు స్ఫూర్తిదాయక మన్నారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. గుంటూరు కళా పరిషత్ గౌరవాధ్యక్షుల ఆలోకం పెద్ద బ్బాయి మాట్లాడుతూ గ్రామాభివద్ధికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటా యన్నారు. గ్రామాభివృద్ధి దృశ్యమాలిక, గ్రామ స్తుల అనుభవాలతో జ్ఞాపిక నే రాసిన పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. ముందుగా వెంకా యమ్మ, చిత్రపటానికి అతిథులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. యడ్లపాడు అభివృద్ధి కమిటీ, లింగారావుపాలెం విజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి 450 మంది హాజరయ్యారు. గుండె, మూత్రపిండాలు, నరాలు, కన్ను, ముక్కు, గొంతు తదితర అవయవాల వైద్య నిపుణుల బందం మర్రి పెద్దయ్య, విద్యాధర్, హిము, వివేకానంద రెడ్డి వైద్య పరీ క్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో మాతలపాటి కాళిదాసు, పోపూరి గంగయ్యచౌదరి, చెరుకూరి సజన, కిలారు వెంకట్రావు, కోడెల సుబ్బారావు, నంబూరి కష్ణారాన్న, హెచ్ఎం కాసు రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ములకలూరులో ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-నూజెండ్ల

మండలంలోని ము లకలూరు గ్రామంలో నెక్స్ట్ జనరేషన్ ఆర్గనైజేషన్ వారి ఆధ్వర్యంలో హెూప్ ఇన్ హాస్పిటల్ గుంటూరు వారిచే సర్పంచ్ కంచర్ల బాబు సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరము ఆదివారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో కంటి పరీక్షలు, హార్ట్ కు సంబంధించి ఈసీజీ,ఆర్థో, బీపీ, షుగర్, పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నెక్స్ట్ జనరేషన్ చైర్మన్ నాగండ్ల శివరామకృష్ణ, ట్రెజరర్ కృష్ణవేణి, వైద్యులు నజరుద్దీన్, షమా సుల్తాన్, నాగేశ్వరరావు, సుధీర్,జగపతి, నవీన్, వలి, అనిల్, మరియు ఆశా కార్యకర్తలు మరియమ్మ, సలోమి పాల్గొన్నారు

పిడుగురాళ్లలో రైళ్ల నిలుపుదలపై ఎంపికు కృతజ్ఞతలు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పిడుగురాళ్లలో రైళ్ల నిలుపుదలకు కృషి చేసిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు, సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులకు ధన్య వాదాలు తెలుపుతూ జోనల్ రైల్వే యూజర్స్ కన్సులేటివ్ కమిటీ మెంబర్ మద్దాలి సుబ్బయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కోవిడ్ అనంతరం సత్తెనపల్లి పిడుగురాళ్ల,నడికుడి స్టేషన్లలో ఆగని పలు ఎక్స్ ప్రెస్ రైళ్ళ కు రైల్వే శాఖ యధావిధిగా ఈ నెల 28 నుండి మళ్ళీ హాల్ట్ లు కల్పించింది. నేటి వరకు సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి స్టేషన్లలో రాత్రి పూట ఆగని తిరుపతి -లింగంపల్లి నారాయ ణాద్రి ఎక్స్ ప్రెస్, భువనేశ్వర్ - కాచిగూడ విశాఖ ఎక్స్ ప్రెస్, ఎంజిఆర్ చెన్నై సెంట్రల్ - హైదరాబాద్ చెన్నై ఎక్స్ ప్రెస్, నాగర్సోల్ నర్సాపూర్ ఎక్స్ ప్రెస్ రైళ్లు కు ఈ నెల 28 నుండి స్టాపింగ్ కల్పిస్తున్నట్టు ఈ మేరకు రైల్వే శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. డిజిఎంకు పల్నాడు,పిడుగురాళ్ల ప్రజలు తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

బోనాలు సమర్పించిన ట్రాన్స్ జెండర్లు

ప్రజాశక్తి-నరసరావుపేట

పల్నాడు జిల్లా నరసరావుపేట లో ఆషాఢమాసం సందర్భంగా ట్రాన్స్ జెండర్స్ అమ్మవారికి మేళాలతో బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ తమ ఇంటి నుండి గంగమ్మ తల్లి ఆలయం వరకు మేళతాళాలతో ఊరేగింపుగా బోనాలతో వెళ్లి ప్రత్యేకంగా పూజలు నిర్వ హించామని తెలిపారు. భిక్షాటన చేసి జీవనం సాగిస్తున్న తమకు దానం చేసిన ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో వుండాలని ఆకాంక్షిస్తామని చెప్పారు. ప్రతి ఆషాడం కూడా ఇలాంటి పూజలు నిర్వ హిస్తామన్నారు. కలెక్టర్ శివ శంకర్ కృషితో ప్రభుత్వ పరంగా తాము సొంత ఇళ్లు చేసుకున్నట్లు చెప్పారు.

వేలం ప్రకటన
మహారాజశ్రీ బాపట్ల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P.No.11/2018 in O.S.No. 409/2014
మాచర్ల వెంకట శివ నాగ ప్రసాద్ ...D.Hr
and
కొప్పాక సంజీవ వరప్రసాద్ ...J.Dr

ఈ నెంబరు అమలులో ఈ దిగువ షెడ్యూలు దాఖల ఆస్తికి శ్రీ కోర్టు వారు ది. 27/07/2023న శ్రీ కోర్టు వారి యేదుట ఉదయం 10:30 గంటలకు బహిరంగ వేలం వేయుదురు ఆసక్తి గలవారు వేలం పాటలో పాల్గొని పాట పాడుకోగలరు.

షెడ్యూలు

Guntur district ponnur sub district aluru villege, Door.no.3-201, D.no.588/5,588/7 an Extent of 592.9 square yards of site with balaji rice mill boundries.
East : Land of Manne Basava Punnamma -378-links
South : aluru donka-131 links
West : Land of Parchuri Sasi Devi-372-links
North : land of parchuri sasi devi -131-links
ఈ హద్దులలో : 0.25 Paise share in the above shedule
వేలం వాయిదా : 27/07/2023
Further hearing : 04/08/2023
D.Hr Value : Rs.7,00,000/-
Amina value : Rs.12,00,000/-

ఇట్లు
G. సువర్ణ నాగమోహిని
D.Hr తరపు న్యాయవాది
బాపట్ల, Cell No: 9908637432

ఫీజుల మోత

- దండుకుంటున్న ప్రైవేట్ విద్యా సంస్థలు
- నర్సరీ నుంచే బాదుడు మొదలు
- పట్టనట్లు వ్యవహరిస్తున్న విద్యాశాఖాధికారులపై ఆరోపణలు

ప్రజాశక్తి -అమరావతి

ప్రైవేట్ విద్యా సంస్థల్లో చేర్పిస్తే తమ పిల్లలకు మెరుగైన భవిష్యత్ ఉంటుందని భావించే తల్లిదండ్రుల ఆలోచనను యాజమాన్యాలు క్యాష్ చేసుకుంటున్నాయి. ప్రైవేట్ పాఠశాలల్లో, కళాశాలల్లో ఫీజులు దండుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా అర్హత లేని ఉపాధ్యాయులతో విద్యాబోధన చేయిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. నియోజకవర్గ పరిధిలోని పెదకూరపాడు,అమరావతి మండలాల్లో ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలు వారి ఇష్టానుసారం ఫీజులు పెం చేస్తుండటం తమకు పెను భారంగా మారిందని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.

అమరావతి మండలంలో 11 ప్రైవేట్ పాఠశాలలు, రెండు కాలేజీలు ఉన్నాయి. మండలంలోని పాఠశాలల్లో ఒక్కో పాఠశాలకు ఒక్కో విధంగా ఫీజు ఉంటోంది. ప్రైవేట్ పాఠశాలల్లో నర్సరీ తరగతి నుంచే ఫీజుల బాదుడు మొదలవుతోంది. మండలంలోని ఓ పాఠశాలలో నర్సరీలో చేరిన విద్యార్థి నుంచి స్కూల్ ఫీజ్, బస్ ఫీజ్ కింద రూ.5,000 తీసుకున్నారు. ఇది కాకుండా యూనిఫామ్ ఛార్జీలు కింద సుమారు మరో రూ.2500 వరకు వసూలు చేస్తున్నారు. ఇంకొన్ని పాఠశాలల్లో నర్సరీ విద్యార్థులకు అయితే సుమారు రూ.15,000 నుంచి 20,000 వరకు వసూలు చేస్తున్న యాజమాన్యాలు లేకపోలేదు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీవో నెంబరు 53, 54 ప్రకారం ప్రాథమిక విద్యకు రూ. 10 వేలు, హైస్కూల్ విద్యకు రూ.15 వేలుగా ఫీజులు నిర్ణయించింది. క్యాపిటేషన్ ఫీజు వసూలు చేయ రాదని, పుస్తకాలను తమ వద్దే కొనుగోలు చేయాలని ఒత్తిడి తీసుకురాకూడదని, బోధన, బోధనేతర సిబ్బంది అర్హ తలను ప్రభుత్వానికి తెలియపరచాలని, విద్యార్థులకు క్రీడా స్థలాన్ని కేటాయించాలని, వారికి ప్రత్యేకంగా పీఈటీని ఏర్పాటు చేయాలని కూడా నిబంధన పెట్టింది. వ్యాన్ ఫీజు అదనంగా వసూలు చేస్తున్నారు. అయితే, ప్రైవేట్ పాఠశాలల యాజ మాన్యాలు వీటిని పట్టించుకోవడం లేదు. విద్యా శాఖాధికారులను తమ గుప్పిట్లో పెట్టుకుని, వారికి ముడుపులు ఇస్తూ ఇష్టానుసారం ఫీజులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

విద్యాశాఖాధికారులకు భారీగా ముడుపులు అందుతుండటంతో కంటి తుడుపు తనిఖీలు చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.



FEES RECEIPT

AMARAVATHI

No.

Name of the Pupil....

Std.... Date....

PARTICULARS	AMOUNT Rs.	Ps.
School fees	4500	00
Bus fees	500	00
	5000	00

Date

Signature

ఓ పాఠశాలలో నర్సరీ విద్యార్థి ఫీజ్ రశీదు

అర్హత లేని టీచర్లతో బోధన

ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాబోధన చేసేవారు బీఈడీ లేదా టీటీసీ పాస్ అయివుండాలి. అయితే మండలంలోని కొన్ని ప్రైవేట్ పాఠశాల్లో తగు విద్యార్హతలు లేనివారిని నియ మించి వారితో పాఠాలు చెప్పిస్తున్నారు. ఇరుకు గదుల్లో విద్యాబోధన చేయిస్తున్నారు. ఏ ఒక్క పాఠశాలలో కూడా సరైన వాహనాలు లేవు. లైసెన్స్ ఉన్న డ్రైవర్లు లేరు. క్లీనర్లు లేరు, ఆట స్థలం లేదు.

పట్టించుకోని అధికారులు

ప్రైవేట్ పాఠశాలల్లో జరుగుతున్న అక్రమాలను స్థానిక విద్యాశాఖాధికారులకు తెలిసినా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారనేది ఆరోపణ. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పం దించి ప్రైవేట్ పాఠశాలపై ఆగడాలను నియంత్రించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎంఇఒల వివరణ

పాఠశాలలో పాఠ్యాంశ పుస్తకాలు విక్రయించకూడదని, అలా చేసిన పాఠశాలపై తగు చర్యలు తీసుకుంటామని ఎంఇఒ-1 ఎం.శ్రీనివాసరావు, ఎంఇఒ-2 సిహెచ్ శివ బాబు అన్నారు. ఫీజు వివరాలు నోటీస్ బోర్డ్ లో ఉంచాలని అర్హత గల ఉపాధ్యాయులచే బోధన చేపట్టాలని అన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న మోడీ

'తొమ్మిదేళ్ల బిజెపి పాలన.. బహిరంగ అధ్యయనం' పై సమావేశం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

'తొమ్మిదేళ్ల బిజెపి పాలన..బహిరంగ అధ్యయనం' అనే అంశంపై స్థానిక పండరీపురంలోని ఏలూరు సిద్దయ్య విజ్ఞాన కేంద్రంలో సమావేశం ఆదివారం జరిగింది. ఈ వేదికకు సాతులూరి బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బహిరంగ అధ్యయన వేదిక కన్వీనర్ పేరుబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్ఆర్ఎస్ సారథ్యంలో బీజేపీ పాలనాపగ్గాలు చేపట్టిందనన్నారు. నాడు గుజరాత్‌ను చూపి ఆ మాదిరి అభివృద్ధిని చేస్తామన్న మోడీ దేశ ప్రజలను మోసం చేశారన్నారు. ప్రజలకు చెప్పిందొకటి చేస్తోంది మరొకటి అని విమర్శించారు. విదేశాల నుంచి నల్లడబ్బు తెచ్చి ప్రజలకు పంచుతామన్న మోడీ హామీ ఏమైందని ప్రశ్నించారు. పెద్ద నోట్ల రద్దుతో ప్రజలకు ఒరి గిందేమిటని ప్రశ్నించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగా లు ఇప్పిస్తామని కనీసం సంవత్స రా నికి మూడు లక్షల ఉద్యోగాలు కూడా ఇవ్వలేక పోయారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామన్నా వారే మాట తప్పారని, రాష్ట్ర విభజన హామీలు నెరవేరుస్తామని చెప్పి ఏ ఒక్క హామీనీ అమలు చేయలేకపోయారని విమర్శించారు. కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లను తీసుకురావడం, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీతో సహా ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణ, ఎల్ఐసిలో పెట్టుబడుల ఉపసంహరణ, రైతుల భూములను కార్పోరేట్ కంపెనీలకు ధారాధత్తం చేసేందుకు వ్యవసాయ చట్టాలు మార్పు చేయడం అన్యాయమన్నారు. మైనార్టీ పౌరసత్వ హక్కులను రద్దు చేసి సిఎఎ, ఎన్ఆర్‌సి చట్టాలను తీసుకొచ్చారన్నారు. నూతన విద్యా విధానం పేరుతో విద్యా రంగంలో కార్పొరేటీకరణ, కాషాయీకరణ విధానాలు అవలంబిస్తున్నారన్నారు. విద్యుత్తు సవరణ బిల్లు ద్వారా వినియోగదారులపై వేస్తున్న భారం ప్రైవేటుకు అనుకూలంగా వున్నా యన్నారు. వ్యవసాయ పంప్ సెట్లకు మీటర్లు పెట్టడం లాంటి రైతు వ్యతి రేక విధానాలకు పాల్పడ్డారన్నారు. ముఖ్యంగా రాష్ట్రాల హక్కులను కాలరాస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏం.విల్సన్,సాంబిరెడ్డి బి. కోట నాయక్, రామ్మోహనం,ఎస్ కరిము ల్లా తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పేరుబోయిన వెంకటేశ్వర్లు

భవన నిర్మాణ సంక్షేమ బోర్డు

నిధులను జమ చేయండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా కరస్పాండెంట్

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నిధులను ఇతర పథకాలకు మళ్లించిన రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆ నిధులను బోర్డుకు జమ చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు కొనసాగించాలని భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వి నరసింహారావు డిమాండ్ చేశారు. స్థానిక పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం పల్నాడు జిల్లా భవన,ఇతర నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సంఘం జిల్లా అధ్యక్షులు అవ్వారు ప్రసాదరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుండి భవన నిర్మాణ కార్మికులకు అందాల్సిన సంక్షేమ పథకాలను తిరిగి ప్రారంభించాలని ఎమ్మెల్యేలకు జులై 15 లోగా వినతి పత్రాలు అందజేస్తామని, అప్పటకీ స్పందించని పక్షంలో చలో విజయవాడకు పిలుపునిస్తామని హెచ్చరించారు.

1996 నుండి భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాన్ని వైసిపి ప్రభుత్వం నీరుగార్చి అటకెక్కించిందని, దీనివల్ల పల్నాడు జిల్లా వ్యాప్తంగా రూ.6 కోట్ల లబ్దిని భవన నిర్మాణ కార్మికులు కోల్పోయారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో కార్మికులకు ప్రమాద మరణం, సహజ మరణం, ప్రసూతి కానుకలు, పెళ్ళికానుకలు తాత్కాలిక అంగ వైకల్యం తదితర సంక్షేమ పథకాలన్నీ భవన నిర్మాణ కార్మికులకు అందిన విషయాన్ని ప్రస్తావించారు. వైసిపి ప్రభుత్వం 1214 మెమో ద్వారా సంక్షేమ పథకాలను నిలిపివేసి భవన నిర్మాణ కార్మికులకు తీరని అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై ఒత్తిడి తీసుకురావానలి కోరారు. సమావేశంలో సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి సిలార్ మసూద్, ఉపాధ్యక్షులు కె. సురేష్, సహాయ కార్యదర్శులు కె.ఆంజనేయులు, సిహెచ్ యేసు, కె.సాంబశివరావు, కె. కోటిరెడ్డి, శ్రీను లక్ష్మినారాయణ, సిహెచ్ శీను, పటాన్ మస్తాన్ వలి, గోపి, జి.రమేష్, ఆర్.కొండలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వి నరసింహారావు

సిపిఎం సీనియర్ నాయకులు షేక్ హైనా మస్తాన్ మృతి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా కరస్పాండెంట్

నరసరావుపేట మండలంలోని పెద తురకపాలేనికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు షేక్ హైనా మస్తాన్(75) మరణం కార్మిక, కర్షక, ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు అన్నారు. మస్తాన్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మరణించారు. ఏపూరి గోపాలరావు, నాయకులు కోట సాయికుమార్, సిద్ధూ తదితరులు సిపిఎం జెండాను మస్తాన్ భౌతికకాయంపై కప్పి నివాళులర్పించారు. గోపాలరావు మాట్లాడుతూ 4 దశాబ్ధాలో సిపిఎం పిలుపు మేరకు అన్ని ప్రజా ఉద్యమాలతో పాటు అంగన్వాడీ, ఆశా మధ్యాహ్నం భోజనం గ్రామ సేవకులు ముఠా కార్మికులు తదితర పోరాటాల్లో మస్తాన్ కీలకంగా వ్యవహరించారని చెప్పారు. సిపిఎం గురజాల మండల కార్యదర్శిగా పని చేశారన్నారు. గురజాల షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలపై, జంగమహేశ్వరపురం సీడ్ ప్రొడక్షన్ ఫారం వర్కర్స్ సమస్యలపై, అలుపెరగని పోరాటం చేశారన్నారు. పేదలకు ఇళ్ల స్థలాల కోసం పోరాటాల్లో ఆయన పాత్ర మరువలేనిదన్నారు. సిపిఎం బలోపేతానికి కృషి చేశారని చెప్పారు. హైనామస్తాన్ మృతి పట్ల సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ సంతాపం ప్రకటించారు. మస్తాన్ కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నివాళులర్పిస్తున్న ఏపూరి గోపాలరావు తదితరులు

వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు, పరీక్షిస్తున్న డాక్టర్ కళ్యాణి

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-అమరావతి: మండల కేంద్రమైన అమరావతికి శ్రీ లక్ష్మీ హాస్పిటల్స్ లో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పం దన లభించింది. శ్రీ లక్ష్మీ హాస్పిటల్ ఆరు వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మెగా క్యాంపు నిర్వహించారు. లక్ష్మీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. సుబ్బారావు నూతనంగా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సేవలను ఆది వారం నుంచి శ్రీ లక్ష్మీ హాస్పిటల్‌లో ప్రారంభించారు. 7వ వార్షికోత్సవ సందర్భంగా అమరావతి మండల ప్రజలకు కార్పొ రేట్ వైద్యాన్ని తక్కువ ధరలకు అందించనున్నట్లు డాక్టర్ శ్రీధర్ చంద్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సుమారు 200 మంది రోగు లను పరీక్షించి ఉచితంగా మందులు అందజేసినట్లు చెప్పారు. వైద్యులు మెదడు, నరములు, గుండె జబ్బులు, ఎముకలు, కీళ్ళు, మోకాలునొప్పులు, కంటి, చెవి, ముక్కు, గొంతు, దంత సమస్యలు ఉన్న రోగులను ఉచితంగా పరీక్షించి మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో నరముల వైద్య నిపు ణులు రామాంజనేయులు, గుండె వైద్యులు కమలాకర్, కంటి వైద్య నిపుణులు శ్రీనివాస్, ఈ ఎన్ టి స్పెషలిస్ట్ డాక్టర్ షర్మిల, డాక్టర్ కళ్యాణి తదితర వైద్యులు రోగులను పరీక్షించి వారికి సలహాలు సూచనలు అందజేశారు.

వామ్మో... విద్యుత్ బిల్లులు..!

సిపిఎం నాయకుల ఎదుట ప్రజల ఆందోళన - బిల్లు ప్రతులు దహనం

చిర్రావూరులో పరిశీలన

ప్రజాశక్తి-తాడేపల్లి

మే నెలకు సంబంధించి బిల్లులు అందుకున్న విద్యుత్ వినియోగదారులు వివిధ రకాల అదనపు ఛార్జీలు చూసి చెల్లించలేమని వినియోదార్లు అంటున్నారు. ఎన్నడూ లేని విధంగా వివిధ రకాల అదనపు ఛార్జీలతో వచ్చిన బిల్లులను చూసి గుండెలు బాదుకుంటున్నారు. రూ.500 బిల్లు కరెంటు మీటరు చూపిస్తే రూ.207 అదనంగా ఛార్జీలు వచ్చాయని ఓ మహిళ వాపోయింది. రూ.282 విద్యుత్ బిల్లు అయితే రూ.406 చెల్లించమంటూ వచ్చిన బిల్లు చూపించి సిపిఎం నాయకుల ముందు వెల్లబోసుకున్నారు. తాడేపల్లి నేతాజీ సెంటర్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సిపిఎం బృందం ఇంటింటికీ తిరిగి విద్యుత్ బిల్లులపై, పెరిగిన ఛార్జీలపై అవగాహన కల్పించారు. ఎవరిని కదలించినా బాదుడే బాదుడు అంటూ కరెంటు ఛార్జీలు పెంచిన తీరు పట్ల ఆందోళణ వ్యక్తం చేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో కొన్ని అవసరాలు మానుకొని విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి వస్తుందని చెప్పారు. వీటికి వ్యతిరేకంగా జరిగే ధర్నాలకు కలిసొస్తామని అంటున్నారు. నేతాజీ సెంటర్‌లో పెంచిన విద్యుత్ బిల్లులను సిపిఎం నాయకులు స్థానిక ప్రజలు దహనం చేశారు. బూరుగ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాశం రామారావు మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలపై దశల వారీగా పోరాడుతామన్నారు. ప్రభుత్వం దొడ్డిదారిన మోడీ సర్కారు తీసుకొచ్చిన విద్యుత్ ఛార్జీలను సర్దుబాటు, ట్రూఆప్ పేరుతో మోత మోగిస్తుందని తెలిపారు. రోజువారీలో ఒక టైమ్‌లో వాడితే ఒక రేటు, ఇంకో టైమ్‌లో వాడితే ఇంకో రేటు అనే విధానాన్ని తీసుకురావడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, సోలా ముత్యాలరావు, బి.గోపాల్‌రెడ్డి, కె.సాంబశివరావు, డివి భాస్కరరెడ్డి, ఎం.శ్రీనివాసరెడ్డి, డి.విజయబాబు, కె.మేరి, వై.బర్నబస్, ఎల్.ఆచారి, టి.నాగేశ్వరరావు (అంజి), రోశయ్య పాల్గొన్నారు.

అసలు 500... కొసరు రూ.207

కంటారి వెంకటేశ్వరమ్మ, బండి వెంకటశివరామకృష్ణారావు

ఈ నెల బిల్లు చూసి షాకయ్యా. అసలు రూ.500 అయితే కొసరు ఛార్జీలు రూ.207 కలిపి రూ.707 బిల్లు వచ్చింది. కరెంటు వాడిన దాని కంటే ఎక్కువ బిల్లు వచ్చిందని తెలుస్తుంది. గతంలో ఎప్పుడో వాడిన దానికి ఇప్పుడు బిల్లు వేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కరెంటు ఛార్జీలు పెరిగి వచ్చాయి. రూ.287 విద్యుత్ వినియోగిస్తే రూ.406 బిల్లు చేతిలో పెట్టారు. ఇది దారుణం. పెంచిన ఛార్జీలు తగ్గించాలి.

గతంఓల ఎన్నడూ లేదు

బత్తుల నరసమ్మ, బొంతు శేషగిరిరావు

ఇంత పెద్దఎత్తున కరెంటు ఛార్జీలు ఎప్పుడూ చూడలేదు. రూ.543 విద్యుత్ వినియోగిస్తే రూ.715 బిల్లు వచ్చింది. రూ.190 విద్యుత్ వినియోగించాం. రూ.294 బిల్లు ఇచ్చారు. దీన్ని వ్యతిరేకిస్తున్నాం. సిపిఎం, వామపక్షాలు చేసే ఆందోళనకు కలిసి వస్తాం.

ఇబ్బడిముబ్బడిగా వచ్చాయి

శివసామ్రాజ్యం, పిచ్చమ్మ

మాకు నాలుగైదు విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. రూ.57 విద్యుత్ వినియోగిస్తే రూ.187 బిల్లు వచ్చింది. రూ.70 వాడితే రూ.201, రూ.32 వాడితే రూ.81, రూ.190 వాడితే రూ.294, రూ.423 వాడితే రూ.705 వచ్చింది. ఇలా ఇబ్బడిముబ్బడిగా పెరిగి వచ్చాయి. తీవ్ర అసంతృప్తిగా ఉంది. గత నెలలో ఇంట్లో ఉండలేదు. అయినా విద్యుత్ వినియోగించినట్లు రూ.114 బిల్లులో చూపించారు. దానికి అదనపు ఛార్జీలు కలిపి రూ.204 చెల్లించమని బిల్లు చేతిలో పెట్టారు.

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ప్రజలపై విద్యుత్ భారాలు అన్యాయమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు అన్నారు. చిర్రావూరు గ్రామంలో పెరిగిన విద్యుత్ బిల్లులను రైతు, కౌలు రైతు సంఘం నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. పలువురు మహిళలు తమకు విద్యుత్ బిల్లులు గతం కంటే అధికంగా వస్తున్నాయని నాయకుల దష్టికి తీసుకువచ్చారు. శివశంకరరావు మాట్లాడుతూ రేంద్ర మోడీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని అన్నారు. అందులో భాగంగానే విద్యుత్ చట్ట సంస్కరణలు తీసుకువచ్చి, సామాన్య ప్రజల పైన, రైతుల పైన విద్యుత్ బారాలు వేస్తున్నారని ఆయన విమర్శించారు. నరేంద్ర మోడీ విధానాలను తూచా తప్పకుండా రాష్ట్రంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారని అన్నారు. వీటికి వ్యతిరేకంగా జరిగే ఉద్యమాల్లో ప్రజలంతా కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కష్ణ, రైతు నాయకులు మేడూరి పాములు, మేడూరి లక్ష్మి, సయ్యద్ సత్తార్, సయ్యద్ నాగుల్, పోకల వెంకయ్య, మీరా, చాంద్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల్ని క్రమబద్ధీకరించాలి

మాట్లాడుతున్న లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందర్నీ క్రమబద్ధీకరించాలని సమాన పనికి-సమాన వేతనం ఇవ్వాలని జెఎసి ఆఫ్ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయీస్, టీచర్స్ అండ్ వర్కర్స్ గుంటూరు జిల్లా చైర్మన్ బి.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. జెఎసి సెక్రెటరీ జనరల్ బి.ముత్యాలరావు అధ్యక్షతన ఆదివారం పాతగుంటూరు, సిఐటియు కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలో 2014 నాటికి ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారినే రెగ్యులర్ చేస్తామని ఎక్కడా వైసిపి చెప్పలేదన్నారు. అందరినీ రెగ్యులరై చేస్తామని చెప్పందని, కానీ దానికి భిన్నంగా ఇప్పుడు ప్రభుత్వం ప్రకటన చేస్తుందని, 3 లక్షల మంది కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను మోసగిస్తుందని విమర్శించారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తామని హామీ ఇచ్చి, తక్కువ వేతనాలతో జీవోలను విడుదల చేసిందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని అందరు ఐక్యంగా ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలన్నారు. హామీలు అమలయ్యే దాకా ఆందోళనకు సంసిద్ధం కావాలన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కొత్తగా వచ్చారని, ఏడాది అయ్యింది అంటూ మంత్రి వ్యాఖ్యలు సరైనవి కాదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించి, 2022 డిసెంబర్ 31 నాటికి పనిచేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని కోరుతూ ఈనెల 22న చేపట్టిన కార్యాచరణలో భాగంగా జులై 2న పట్టణ, మండల సదస్సులు, 5న సిఎంకు ఈమెయిల్స్, 8న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హెచ్ఒడిలకు ఈమెయిల్స్ పంపాలని, 15న మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇవ్వాలని, 24న కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలు, ఆగస్టు 5న నాయకుల నిరాహార దీక్షలు, ఆగస్టు 16న ఛలో విజయవాడ నిర్వహించాలని తీర్మానిం చారు. ఈ సమావేశంలో జేఏసీ రాష్ట్ర కార్యదర్శి వి.రమేష్‌బాబు వివిధ విభాగాల నాయకులు జి.పవన్, రవీంద్రబాబు, తిరుమలయ్య, సురేష్, రాజేష్, రాంబాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఇచ్చిన హామీని అమలు చేయాలి

సమవేశంలో మాట్లాడుతున్న రమాదేవి

ప్రజాశక్తి-గుంటూరు

ఎన్నికలకు ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈరోజు సిఐటియు జిల్లా విస్తృత సమావేశం సిఐటియు జిల్లా కార్యాలయంలో దండా లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం కాంటాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయని ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. ఈ డిమాండ్ల సాధనకు దశలవారీగా జరిగే పోరాటంలో కాంటాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునర్ధరించి కార్మికులను ఆదుకోవాలని కోరారు. సంక్షేమ బోర్డు పనిచేయకపోవడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ 99శాతం వాగ్దానాలు అమలు చేశామన్న ముఖ్యమంత్రి కార్మికులకు సంబంధించిన ఒక్క హామీని అమలు చేయలేదని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు అండగా, వారు చేస్తున్న పాదయాత్రకు మద్దతు సిఐటియు తెలియజేస్తుందని తెలిపారు. తక్షణమే పోలవరం నిర్వాసితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు బి.ముత్యాలరావు ఎస్.కె.హుస్సేన్‌వలి,

యూనిఫామ్ సివిల్ కోడ్ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

ప్రజాశక్తి - దుగ్గిరాల

యూనిఫామ్ సివిల్ కోడ్ అసంబద్ధమే కాకుండా రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైనదని భారత ప్రజాస్వామ్య లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సమితి నాయకులు షేక్ సుభాని అన్నారు. స్థానిక ముర్తుజా నగర్ జండా చెట్టు వద్ద ఆదివారం కరపత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం యూనిఫామ్ సివిల్ కోర్టును ప్రవేశపెట్టాలని చూస్తోందని, ఇది కేవలం ముస్లిముల సమస్య కాదని, విభిన్న జాతులు, సంస్కృతులు, సంప్రదాయాలున్న దేశంలో అందరికీ ప్రమాదమని చెప్పారు. సివిల్ కోర్ట్ అమలు వల్ల రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను అరికట్టడమే అన్నారు. దేశంలో ప్రధాన సమస్యలపై దృష్టి పెట్టకుండా ప్రజలను పక్కతోవ పట్టించడమే బిజెపి లక్ష్యంగా ఉందని విమర్శించారు. కార్యక్రమంలో షేక్ రషీద్, పఠాన్ ఖాదర్, షేక్ జాను, అయుబ్ పాల్గొన్నారు.

కౌలురైతు గుర్తింపు కార్డు పొందాలి

ప్రజాశక్తి- మేడికొండూరు

కౌలురైతు గుర్తింపు కార్డులపై మండలంలోని సిరిపురంలో ఆదివారం అవగాహన సదస్సు జరిగింది. కౌలు రైతు సంఘం నాయకులు బి.రామకృష్ణ మాట్లాడుతూ కౌలు రైతు గుర్తింపు కార్డు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతి కౌలురైతు వాటిని పొందాలని చెప్పారు. ఎన్.శ్రీధర్, కె.వెంకట్రావు పాల్గొన్నారు.

కెఎల్‌యు విద్యార్థినికి అవార్డు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

విజ్ఞాన్ యూనివర్సిటీలో ఈ నెల 16 నుండి జరుగుతున్న సాంస్కృతిక పోటీల్లో కెఎల్ డీమ్డ్ యూనిర్శిటీలో బిఎఎల్‌ఎల్‌బి ప్రథమ సంవత్సరం విద్యార్థిని జె.షణ్ముఖి జాతీయ స్థాయి అవార్డును సొతం చేసుకున్నట్లు వర్శిటీ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు ఆదివారం తెలిపారు. ఎన్‌సిసి 10వ ఆంధ్రా బెటాలియన్‌కు చెందిన జె.షణ్ముఖి 10 రోజులుగా విజ్ఞాన్ యూనిర్శిటీలో ఏక్ భారత్ -శ్రేష్ట భారత్ అనే కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటున్నట్లు తెలిపారు. అందులో భాగంగా జాతీయ స్థాయిలో సాంస్కృతిక పోటీలను నిర్వహించగా కూచిపూడి నృత్య ప్రదర్శనతో జె.షణ్ముఖి ప్రథమ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. షణ్ముఖికి ఎన్‌సిసి గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్.ఎం.చంద్రశేఖర్ అవార్డును ప్రధానం చేశారని తెలిపారు. షణ్ముఖిని వీసీ డాక్టర్ జి.పార్ధసారధివర్మ, ప్రో వీసీ డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యారిద్ధ విభాగాధిపతి సలహాదారులు డాక్టర్ కెఆర్ఎస్.ప్రసాద్, డాక్టర్ హబీబుల్లాఖాన్, హాబీక్లబ్ ఇన్‌ఛార్జి ఆర్.సుబాకర్ రాజు, ఎన్‌సిసి 25వ ఆంధ్రా బెటాలియన్ కల్నల్ ఎస్.సిద్ధు, సుబేదార్ మేజర్ విజయ్ మోహిత్, సమన్వయకర్త జి.చంద్రశేఖర్ అభినందించారు.

ఒపిఆర్ఎస్ చేయించుకుంటే 10 శాతం రాయితీ

ప్రజాశక్తి - రెంటచింతల

ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు టిక్కెట్ ధరలో 10 శాతం రాయితీ కల్పిస్తామని మాచర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ ఆర్ పిచ్చయ్య తెలిపారు. ఆదివారం రెంట చింతల బస్టాప్ ను సందర్శించి వాహనాలను నిలిపిన వారిపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ప్రయా ణికులు కూర్చోకుండా ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేయుట ఏమిటని ఆగ్ర హించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ మాచర్ల డిపో నుంచి హైదరాబాదుకు 16, తిరుపతికి 1, కర్నూలుకు 1 బస్సు సర్వీసును నడుపుతున్నా మని, ఒఆర్ఎస్ (ఆన్లైన్ ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టం) చేయించుకున్న వారికి రాను పోను రాయితీ అంటే 20 శాతం దాకా ఉంటుందని ప్రయా ణికులు రిజర్వేషన్ కు ప్రాధాన్యత ఇవ్వాలని నొక్కి చెప్పారు మే నెలలో ఐదు కోట్లు, జూన్ నెలలో ఇప్పటివరకు నాలుగు కోట్ల ఆదాయం వచ్చిందని దీని అంతటికి అంకితభావంతో పనిచేసే సిబ్బంది కారణ మని గర్వంగా పేర్కొన్నారు.

తుమ్మకోటకు రూ.20 లక్షలు విడుదల

ప్రజాశక్తి-రెంటచింతల

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించి మండలంలోని తుమ్మరకోట గ్రామానికి రూ. 20 లక్షల రూపాయలు మంజూరైనట్లు పంచాయతీరాజ్ ఏఈ పాశం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే పిన్నెల్లి రామ కృష్ణారెడ్డి ఈ గ్రామంలో ఎనిమిది రోజులు పాటు పర్య టించారని ఏఈ తెలిపారు ఈ నిధులతో ఎస్సీ కాలనీ ముస్లిం మైనార్టీ వీధుల్లో సీసీ రోడ్లు వేస్తామని ఆయన తెలిపారు వీటికి సంబంధించి ఆదివారం భూమి పూజ కూడా చేశారు కార్యక్రమంలో ముత్తయ్య బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు

మంత్రి.. గణపవరం 3వ వార్డులో పర్య టించండి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

స్థానిక మున్సిపల్ పరిధిలోని గణప వరంలోని 3వ వార్డులో జన సేన పార్టీ నాయకులు ఆదివారం పర్య టించారు. ఈ పర్యటనలో ఉమ్మడి గుంటూరు జిల్లా కార్య దర్శి తోట రాజా రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డు లలోని అనేక సమస్యలను ప్రజలు తమ దృష్టికి తెచ్చా రన్నారు. అభివృద్ధి చేస్తున్నామని చెప్పుకుంటున్న మంత్రి విడుదల రజిని ఒక్కసారి గణపవరం మూడో వార్డులో పర్య టించాలని కోరారు. ప్రజలకు తాగునీరు కూడా అం దించ లేని నిస్సహాయ స్థితిలో మంత్రి, ఈ ప్రభుత్వం ఉందని విమ ర్శించారు. తక్షణమే మంచినీటి సమస్యను, పారిశుద్ధ్య సమ స్యను, స్మశాన వాటికను ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి షేక్ సుభాని, చిలకలూరిపేట నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షల్లో

'బాలభాను' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కారెంపూడి

షేక్ సానియామీరా, బి వినీల్

మండల కేంద్రమైన కారెంపూడిలోని ఆదర్శ పాఠ శాలలో నిర్వహించిన ఆరవ తరగతి ప్రవేశ పరీక్షలలో స్థానిక బాల భాను విద్యార్థులు 1,4,6 ర్యాం కులు సాధించినట్లు కర స్పాండెంట్ సిహెచ్ శివానందరావు ఆదివారం తెలిపారు. పరీక్షలకు ఐదుగురు విద్యార్థులు హాజరు కాగా మొదటి ర్యాంకు బత్తుల వినీల్, 4వ ర్యాంకు షేక్ సానియామీర ఆరవ ర్యాంకు పేల్లూరి రామకృష్ణ సాధించారు. మిగిలిన ఇద్దరు విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

నైస్ లో అర్హత సాధించిన కారెంపూడి విద్యార్థి

నాదెండ్లలోని నైస్ విద్యాసంస్థలు నిర్వహించిన ఆరవ తరగతి ప్రవేశ పరీక్షలలో కారెంపూడికి చెందిన కోరే అజయ్ కుమార్ అర్హత సాధించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

భారాలు మోపితే ప్రజాఉద్యమాలు చేపడతాం

సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్

ప్రజాశక్తి-మాచర్ల

రాష్ట్ర ప్రభుత్వం ఇంటి పన్ను, విద్యుత్ ఛార్జీలు రూపంలో ఇబ్బడిముబ్బడిగా ప్రజలపై భారాలను మోపు తోందని, అవి ఉపసంహరించుకోకపోతే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన మాచర్ల డివిజన్ కమిటీ సాధారణ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజ రయ్యారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు తెలియకుండా భారాలు వేయడంలో నేర్పరితనం చూపిస్తోందని విద్యుత్ చార్జీల అడ్డగోలు పెంపు వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో పురపాలక శాఖ పరిధిలో ఆస్తి పన్ను అద్దె ఆధారంగా ఉండేదని, ఇప్పుడు విలువ ఆధారంగా పెంచడం వలన ప్రజలపై భారం పడు తోందన్నారు. ప్రజలపై అడ్డగోలుగా భారాలు వేసిన ఏ ప్రభుత్వాలు ఎక్కువ కాలం మనుగడ సాగించలేదన్నారు. ఈ పన్నుల భారాలకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో ఉద్యమం జరగనున్నట్లు చెప్పారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారని , ఆ హామీ ప్రకారం వివిధ ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇస్తానని హామీ ఇచ్చారని అది అమలు చేయా లన్నారు. వరిక పూడి సెల ఎత్తిపోతల పథకం కరువు ప్రాంతాలైన మాచర్ల వినుకొండ పుల్లలచెరువు ప్రాంతాల్లోని అనేక గ్రామాలకు వరమని దానిని చిత్తశుద్ధితో పూర్తి చేయా లన్నారు. గత ప్రభుత్వాలు మాదిరిగా శంకుస్థాపన కాకుండా వెంటనే కాంట్రాక్టరుని పిలిచి పనులు ప్రారం భించాలన్నారు. పోలవరం నిర్వాసితుల కోసం జరుగు తున్న పోరుబాటకు మద్దతు తెలిపాలని ఆర్థిక సహకారం అందించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు లక్ష్మీశ్వర్ రెడ్డి, స్థానిక నాయకులు బండ్ల మహేష్,ఎన్ లక్ష్మయ్య,వెంకటరత్నం, సురేష్, శోభన్ కుమార్, జె.శ్రీను, వి.వెంకట్రావు, ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు,ఆదిత్య, చైతన్య పాల్గొన్నారు.

సత్తెనపల్లి సమావేశంలో మాట్లాడుతున్న ధరణికోట విమల

28న ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని సిపిఎం సత్తెనపల్లి పట్టణ కార్యదర్శి ధరణికోట విమల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 28న తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక కొత్తపేట మహాలక్ష్మి చెట్టు వద్ద జరిగిన వీధి సమా వేశంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. విమల మాటా డుతూ గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో ఉండే విద్యుత్ శాఖను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తన పరిధిలోనికి లాగేసుకొని తన ఇష్టం వచ్చినట్లు విద్యుత్ ఛార్జీలను పెంచు తున్నారని విమర్శించారు. కేంద్రం పెంచమన్నప్పుడల్లా రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచి అమలు చేస్తోందని, ఇప్పటికి ఏడుసార్లు పెంచి ప్రజలపై భారాలు మోపారని విమర్శించారు. పీక్ అవర్ పేరుతో కొన్ని ప్రత్యేక వేళల్లో ప్రత్యేక విద్యుత్ ఛార్జీలను పెంచడానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందని అన్నారు. ఈ నేపథ్యంలో పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని అన్ని రాజకీయ పార్టీలు,ప్రజాసంఘాల ఆధ్వర్యంలో 28న తహశీల్దార్ కార్యా లయం వద్ద ఉదయం 10 గంటలకు జరిగే ధర్నాలో ప్రజలు పాల్గొనాలని కోరారు. సమావేశంలో సిపిఎం నాయకులు డి.వెంకటేశ్వర్లు, స్థానిక మహిళలు కామేశ్వరి, అంజని,సునీత తదితరులు పాల్గొన్నారు.

రైతు మహాధర్నా వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - వినుకొండ : రైతుల సమస్యలపై 30వ తేదీన విజయవాడలో జరిగే ధర్నా కార్యక్రమానికి మద్దతుగా స్థానిక పుతుంబాక వెంకట పతి భవన్‌లో ఆదివారం గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాల్ మాట్లాడుతూ గత ఏడాది అకాల వర్షాలకు పంట దెబ్బతిన్న రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ,పంటల బీమా వెంటనే చెల్లిం చాలని, పెట్టు బడులు పెరిగి నందున ఇన్ పుట్ సబ్సిడీ ఆహారం పంటలకు రూ.10,000, వాణిజ్య పంటలకు రూ.25,000 కు పెంచాలని డిమాండ్ చేశారు. పావలా వడ్డీ, సున్నా వడ్డీ పథకాలకు గత కొన్ని సంవత్సరాలుగా ఆపిన నిధు లను వెంటనే చెల్లించాలని, పెట్టుబడులు పెరిగి నందున సున్నా వడ్డీ రూ.2,00000 లకు పావలా వడ్డీ రూ.5,00000 కు పెంచాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పంటల మద్దతు ధర కనీసం పెట్టుబడులకు కూడా చాలనందున, కేరళ ప్రభుత్వం క్వింటా ధాన్యం కు కేంద్ర మద్దతు ధర కు అదనంగా రూ.800 ఇస్తోందని, కర్ణాటక, ఛత్తీస్‌ఘడ్, తమిళ నాడు రాష్ట్రాలు కొంత అదనంగా కల్పిస్తున్నారని తెలిపారు. సాగు నీటి ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేసి సాగు, తాగు నీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ప్రభుత్వ అవసరా లకు సేకరించే భూములకు పరిహారం ప్రస్తుత దరల ప్రకారం చెల్లించాలని, చుక్కల భూములు రాష్ట్రంలో 24 లక్షల ఎకరాలకు గాను 2 లక్షల ఎకరాలకు మాత్రమే పరిష్కారం లభించిందని మిగిలిన భూములు సమస్యను కూడా పరి ష్కరించాలని డిమాండ్ చేశారు. రైతు మోటార్లకు మీటర్లు బిగించొద్దని, కౌలు రైతులందరికీ కౌలు రైతు కార్డులు ఇవ్వాలన్న డిమాండ్లతో 30వ తేదీన జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు సిహెచ్ సురేష్ రాజా, ఆర్. ముని వెంకటేశ్వర్లు, సత్యనారాయణ కంభంపాటి, ఆశీర్వాదం పాల్గొన్నారు.

చల్లపల్లి తండాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా కరస్పాండెంట్

రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా ఎప్పటికప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర జలవనురుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గం, రాజుపాలెం మండలం, ఉప్పలపాడు గ్రామ పరిధిలోని చల్లపల్లి తండాలో పలు అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలలో ఆదివారం జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, నరస రావుపేట ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలతో కలిసి మంత్రి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో జల జీవన్ మిషన్ ద్వారా రూ.19.44 లక్షలతో ఇళ్ల నిర్మాణాలలో ఏర్పాటు చేసిన నీటి ట్యాప్ కనెక్షన్ ను శ్రీకృష్ణదేవరాయలు ప్రారంభించారు. చల్లపల్లి తండాలో అర్హులైన ప్రజలకు అటవీశాఖ ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలను కలెక్టర్ పంపిణీ చేశారు. మంత్రి, ఎంపిలు మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో పేద ప్రజలకు అం దిస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను వినియోగించుకొని, జీవన విధానంలో మార్పులు తీసుకురావడానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం (గ్రామీణ్) లో ఇల్లు నిర్మించుకునే పేద ప్రజ లకు రూ.1.80 లక్షలను ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు, మండల అధికారులు పాల్గొన్నారు.

గృహ ప్రవేశం సందర్భంగా రిబ్బన్ కట్ చేస్తున్న ఎంపి శ్రీకృష్ణదేవరాయలు. చిత్రంలో మంత్రి , కలెక్టర్

కేసనపల్లి లో జగనన్న సురక్ష సర్వే

ప్రజాశక్తి - దాచేపల్లి

దాచేపల్లి మండలం కేసనపల్లిలో ఆదివారం సచి వాలయ సిబ్బంది గ్రామ వాలంటీర్లు ఇంటింటికి తిరిగి జగనన్న సురక్ష కార్యక్రమంలో గ్రామంలో ప్రతి ఇంటికి తిరుగుతూ గత నాలుగేళ్లుగా కుటుంబాలకు ప్రభుత్వ పరంగా అందిన పథకాలపై వివరాలు సేకరించారు. అదే విధంగా పథకాలు ఎవరెవరికి అందలేదు, ఇందుకు గల కారణాలు ఏమిటి అనే విషయాలపై ఆరా తీశారు. అర్హుల వివరాలు సేకరించి వారి వద్ద నుండి అవసరమైన గుర్తింపు పత్రం తీసు కున్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - నూజెండ్ల

నూజెండ్ల ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్లో) 7,8,9 తరగతుల విద్యార్థులకు ఖాళీల భర్తీ కోసం నోటిఫికేషన్ జారీ చేయడమైనది అని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పద్మజ తెలిపారు, ఈనెల 24వ తేదీ నుండి 27వ తేదీ వరకు దర ఖాస్తులు స్వీకరించబడినని తెలిపారు, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 28వ తారీకు ఉదయం 10 గంటలకు స్కూల్లో పరీక్ష నిర్వహించబడును, పరీక్షల్లో మెరిట్, రోస్టర్, విధానంలో సీట్లు భర్తీ చేయనున్నట్లు చెప్పారు.

వట్టికుంట చారిటబుల్ ట్రస్ట్ నోట్‌బుక్స్ పంపిణీ

ప్రజాశక్తి-అమరావతి

మండల పరిధిలోని ధరణికోట గాంధీ బొమ్మ సెంటర్లో ఆదివారం రాత్రి వట్టికుంట చారి టబుల్ ట్రస్ట్ చైర్మన్ వట్టి కుంట శేషగిరిరావు ఆధ్వర్యంలో శేషన్న విద్యా కానుకను విద్యార్థినీ విద్యార్థులకు పంపిణీ చేశారు. గ్రామంలోని సుమారు 500 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఉచిత నోట్ బుక్స్‌ను శేషగిరిరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వడ్లమూడి, శ్రీనివాసరావు,వట్టికుంట భాను, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై 30న మహాధర్నా

జయప్రదం చేయాలని కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు పిలుపు

మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిహరిబాబు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

రైతు సమస్యల పరిష్కారానికై జూన్ 30వ తేదీన ధర్నా చౌక్ విజయవాడ అలంకార్ సెంటర్ వద్ద జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు పిలుపునిచ్చారు. కుంచనపల్లిలో రైతు కౌలు రైతుల విస్తృత సమావేశం నాయకులు ఎ.రంగారావు అధ్యక్షతన శనివారం రాత్రి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన హరిబాబు మాట్లాడుతూ గతేడాది అకాల వర్షాల వలన రైతులు పంటల నష్టపోయి పూర్తిగా దెబ్బ తిన్నారని ఆయన అన్నారు. మరలా 2023 ఏప్రిల్ మే నెలలో కురిసినకాల వర్షాలు వలన రైతులు తీవ్రంగా నష్టపోయినా ప్రభుత్వం సాయం చేయలేదని విమర్శించారు. పంట నష్టపోయిన రైతులందరికీ పంటల బీమా, ఇన్పుట్ సబ్సిడీలను తక్షణమే రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఇన్పుట్ సబ్సిడీ ఆహార పంటలకు ఎకరాకు రూ.10 వేలు, వాణిజ్య పంటలకు రూ.25 వేలు ఇవ్వాలన్నారు. వడ్డీ రాయితీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు పెట్టుబడులకు చాలా స్థితిలో ఉన్నాయన్నారు. కేరళ ప్రభుత్వం వరి ధాన్యానికి క్వింటాళ్‌కు రూ.780 ఇస్తోందని, కర్ణాటక తమిళనాడు చత్తీస్‌ఘడ్ ప్రభుత్వాలు అదనంగా బోనస్ ఇస్తున్నాయని చెప్పారు. ఏపీలోనూ 20 శాతం బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ పాడి రైతులకు ముఖ్యమంత్రి ప్రకటించిన లీటరుకు రూ.4 బోనస్ వెంటనే ఇవ్వాలని కోరారు. వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లు పెట్టే చర్యలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.వెంకటరెడ్డి, కౌలురైతుప సంఘం మండల కార్యదర్శి పి.కృష్ణ, ఎ.సుబ్బారావు, బి.ప్రసాద్‌రావు, పి.సుబ్బారావు, ఎ.నాగేశ్వరరావు, జె.సత్యనారాయణ, ఎస్.రవి కిషోర్, ఎ.ఆదయ్య, కె.యశోద పాల్గొన్నారు.

అవార్డులకు ప్రతిభే ప్రామాణికం కావాలి

రాధాకృష్ణను సన్మానిస్తున్న కవులు, కళాకారులు

ప్రజాశక్తి-గుంటూరు

అవార్డులు ఎవరి కిచ్చినా ప్రతిభ ప్రామాణికంగానే ఇవ్వాలని, అవార్డు ప్రకటించాక ఆ అవార్డుపై విమర్శలు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆయా సంస్థలపైనే ఉందని నాటకరంగ ప్రముఖులు, నట కంఠీరవ బిరుదాంకితులు తుర్లపాటి రాధాకష్ణమూర్తి అన్నారు. గుంటూరు సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హాలులో ఆదివారం నవ్యాంధ్ర రచయితల సంఘం ఆధ్వర్యంలో 'కవిమిత్రుల కలయిక-కవి సమ్మేళనం' నిర్వహించారు. రాధాకష్ణమూర్తి మాట్లాడుతూ ద్రౌపది పాత్రతో నాటక రంగంలో ప్రవేశించానని, తర్వాత దుర్యోధనుడి పాత్ర కొన్ని వేలసార్లు పోషించానన్నారు. ఎన్నో అవార్డులు, ప్రశంసలు పొందానని, అప్పట్లో అవార్డులపై ఎప్పుడూ విమర్శలు వచ్చేవి కాదన్నారు. నాటకరంగంలో కొనసాగుతూనే జంధ్యాల పాపయ్యశాస్త్రి, గుర్రం జాషువా పద్యాల సాహచర్యంతో పద్యాలు కూడా రాయగలిగానని అన్నారు. సభాధ్యక్షులు డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ- ప్రతిమాసం ఒక మంచి పుస్తకాన్ని సమీక్షిస్తూ, కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామని, కవిసమ్మేళనంలో పాల్గొనే కవులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో 'శ్యామ' పుస్తక అనువాదకులు కందిమళ్ళ శివప్రసాద్, డాక్టర్ వంగిపురపు శారదాదేవి, నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో సౌపాటి ప్రభాకర్, ఆళ్ళ నాగేశ్వరరావు, రహీమ్ సాహెబ్, కారంచేటి విజయ్ కుమార్, గోలి హనుమచ్ఛాస్త్రి, తాటికోల పద్మావతి, యక్కంటి పద్మావతి, మన్నం వెంకటగురువు, కొణతం నాగేశ్వరరావు, కె.లీలాకష్ణ, బాబూ మస్తాన్, పింగళి భాగ్యలక్ష్మి, మండే సుబ్రహ్మణ్యం పాల్గొని తమ కవితల్ని వినిపించారు. ఉత్తమ కవిత రాసిన మండే సుబ్రహ్మణ్యను తుర్లపాటి రాధాకష్ణమూర్తి చేతుల మీదుగా నగదు బహుమతితో సత్కరించారు.

విజ్ఞాన్‌లో ముగిసిన ఎన్‌సీసీ క్యాంపు

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఏక్ భారత్..శ్రేష్ఠ భారత్ ఎన్‌సిసి శిబిరం నిర్వహణలో భాగంగా 600 మంది ఎన్‌సీసీ క్యాడెట్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరం ఆదివారం ఘనంగా ముగిసింది. ఆంధ్రప్రదేశ్, పంజాబ్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, చత్తీస్‌ఘడ్‌ల నుంచి హాజరైన ఎన్‌సీసీ విద్యార్థులకు 12 రోజులపాటు సాంస్కృతిక శిక్షణా శిబిరం నిర్వహించారు. గుంటూరు ఎన్‌సీసీ గ్రూప్, క్యాంపు కమాండర్ కల్నల్ ఎస్ఎమ్.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఏక్ భారత్.. శ్రేష్ట భారత్‌లో భాగంగా నిర్వహించిన శిక్షణా శిబిరంలో విద్యార్థులు వారి రాష్ట్రాలకు చెందిన సంస్కృతి, సంప్రదాయాలను ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు వివిద ప్రదర్శనల ద్వారా తెలియజేయడమే ఈ క్యాంపు ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ ఎన్‌సిసి వలన విద్యార్థులకు క్రమశిక్షణ, సమయపాలన, సానుకూల దక్పథం, సమాజంలో ఇతరులతో ఎలా మెలగాలో నేర్చుకుంటారని తెలియజేశారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ మాట్లాడుతూ ఎన్‌సిసి వలన క్రమశిక్షణతో పాటు, కలిసి మెలిసి ఉండటం, ప్రజలకు సామాజిక సేవచేసే అవకాశం దొరుకుతుందన్నారు. శిక్షణా శిబిరంలో పలు పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులకు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వీసీ, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, గుంటూరు ఎన్‌సీసీ గ్రూప్, క్యాంపు కమాండర్ కల్నల్ ఎస్ఎమ్. చంద్రశేఖర్, గుంటూరులోని 25ఏ బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ సీఎస్ సిద్ధు ఆయా విభాగాల డీన్లు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాంపులో పాల్గొన్న క్యాడెట్లతో కమాండర్, వీసీ తదితరులు

రాజధాని పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని ప్రాంతంలోని పారిశుధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం.రవి డిమాండ్ చేశారు. తుళ్లూరులో ఆదివారం చెరుకూరి సుశీల అధ్యక్షతన సంఘం విస్తృత సమావేశం నిర్వహించారు. రవి మాట్లాడుతూ మూణ్ణెల్లుగా జీతాలు రాక కార్మికులు ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారని, అయినా సిఆర్‌డిఎ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కార్మికులకు 18 నెలల పెండింగ్ పీఎఫ్ గురించి అడిగితే సూపర్‌వైజర్‌లు, కో-ఆర్డినేటర్ పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని విమర్శించారు. కార్మికులందరికీ ఇఎస్ఐ కార్డులు ఇవ్వలేదన్నారు. పిఎఫ్, ఇఎస్ఐతో తమకు సంబంధం లేదంటూ తప్పించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులను చీటికిమాటికి పనిలో నుండి తొలగిస్తామంటూ కొంతమంది సూపర్‌వైజర్‌లు బెదిరింపులకు దిగుతున్నారని, పనిష్మెంట్ల పేరుతో రోజుల తరబడి కార్మికులను పనిలోకి రానివ్వకుండా అడ్డుకుంటున్నారని చెప్పారు. అపరిశుభ్ర ప్రదేశాలలో పని చేస్తున్న కార్మికులకు రక్షణ పరికరాలు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారని అన్నారు. వేధింపులతో మానసిక ఒత్తిడికి గురై కొంతమంది పారిశుధ్య కార్మికులు పని మానివేశారన్నారు. వేధింపులు కొనసాగితే మరో పోరాటానికి కార్మికుల సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. కార్మికులకు రూ.15 వేల జీతం, రూ.6 వేలు మెడికల్ అలవెన్స్ కలిపి రూ.21 వేలు చెల్లించాల్సి ఉండగా, రూ.12 వేలతో సరిపెడుతున్నారని విమర్శించారు. మాస్కులు, గ్లౌజులు, సబ్బులు,కొబ్బరి నూనె, చెప్పులు, రెండు జతల యూనిఫారం ఇవ్వాలని, డిమాండ్ చేశారు. వీఇపై సిఐటియు ఆధ్వర్యంలో దశల వారీగా ఆందోళనలకు సిద్ధమని చెప్పారు. సమావేశంలో సంఘం నాయకులు వీరాంజనేయులు, రామాంజనేయులు, జ్యోతి, మరియమ్మ, సుఖవేణి, కోటేశ్వరరావు, వీరలంకమ్మ, శిరీష, వెంకాయమ్మ, జైమేరీ, కల్యాణిలక్ష్మి, రత్నకుమారి, మార్తమ్మ, అరుణ కుమార్, మధురవాణి, మల్లేశ్వరి, శ్రీను, దేవదాస్, బుజ్జి, సుమలత పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎం.రవి

వాలీబాల్ విజేత బాబూజగ్జీవన్‌రామ్ జట్టు

ముగిసిన 'మంగళగిరి వాలీబాల్ లీగ్-2' పోటీలు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి బైపాస్ రోడ్డులోని నారా లోకేష్ క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న 'మంగళగిరి వాలీబాల్ లీగ్-2' పోటీలు ఆదివారం ముగిశాయి. విజేతలకు మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, టిడిపి మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ జూలకంటి బ్రహ్మానందరెడ్డి అందజేశారు. క్రీడాకారులకు నగదు, సర్టిఫికెట్స్, ట్రోఫీలతో పాటు టోర్నమెంట్‌లో పాల్గొన్న ప్రతి జట్టుకు వాలీబాల్ కిట్టు అందజేశారు. ప్రథమ బహుమతి కింద రూ.50 వేలు నిడమర్రుకు చెందిన బాబు జగ్జీవన్‌రామ్ జట్టుకు, ద్వితీయ బహుమతి కింద రూ.30 వేలు ఈమనికి చెందిన మన్నవ అశోక్ జట్టుకు, తృతీయ బహుమతి కింద రూ.20 వేలు మంగళగిరి 15వ వార్డుకు చెందిన డి.ఎం యూత్ జట్లు గెలుపొందాయి. మన్నవ అశోక్ జట్టు, నిడమర్రుకు చెందిన బాబు జగ్జీవన్‌రామ్ జట్ల మధ్య ఆదివారం జరిగిన ఫైనాల్ మ్యాచ్‌ను కన్నా లక్ష్మీనారాయణ ప్రారంభించారు. క్రీడల్లో రాణించే వారు జీవితంలో ఎటువంటి ఆటుపోట్లైనా ఎదుర్కొంటారని, వారిలో మానసిక స్థిరత్వం ఉంటుందని అన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తేనే జీవితంలో ముందుకు సాగుతామని చెప్పారు. నారా లోకేష్ సొంత నిధులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం గొప్ప విషయమన్నారు. జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ఆణిముత్యాల్లాంటి క్రీడాకారులను ప్రోత్సహించి వారికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా తీర్చిదిద్దడమే నారా లోకేష్ లక్ష్యమన్నారు. ప్రతిఒక్కరు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ఎన్.అబద్దయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి టి.జానకీదేవి, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసరావు, టిడిపి పట్టణ అధ్యక్షులు వి.వెంకట్రావు, ఐ.పెంచలయ్య, కె.కిరణ్, ఐ.భాస్కర్, సిహెచ్.సుబ్బారావు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-తెనాలి

రౌడీషీటర్ల కదలికలపై పోలీస్ నిఘా ఉంటుందని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించబోమని త్రీటౌన్ సిఐ రమేష్‌బాబు హెచ్చరించారు. స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు ఆదివారం ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. సత్ప్రవర్తన కలిగి ఉండాలని, కుటుంబం పట్ల బాధ్యతగా ఉండాలని చెప్పారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. రాత్రివేళ గస్తీలో కొందరు యువకులు 11 గంటల తరువాత కూడా అనవసరంగా బైక్‌పై సంచరించటం గమనించానని, పైగా ఒక్కో బైక్‌పై ముగ్గురు ఉంటున్నారని, ఇలాంటి వాటిని తీవ్రంగా పరిగణిస్తామని అన్నారు. పట్టణంలో గంజాయి వ్యవనపరులు, విక్రేతల సంచారం ఉన్నందున పోలీస్ నిఘా ఉంటుందన్నారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని, అసాంఘిక శక్తులపై ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

శివనాగులు కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

మండలంలోని కట్టెంపూడి సర్పంచ్ వడాలశెట్టి శివనాగులు తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఆదివారం పరామర్శించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ హనుమంతరావు

ఉచితంగా ఆయుర్వేద వైద్యసేవలు

ప్రజాశక్తి - మంగళగిరి

రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి, స్నిగ్ధ అయుర్వేద ఫౌండేషన్ గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని రత్నాలచెరువులో ఉన్న సింహాద్రి శివారెడ్డి భవన్‌లో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు ప్రారంభించారు. డాక్టర్ చైతన్య, డాక్టర్ సుదర్శన్, డాక్టర్ టీనాశర్వాణి తదితరులు సుమారు 100 మందికి కీళ్ల నొప్పులు, సయాటికా, పక్షవాతం, చర్మ సంబంధ వ్యాధులకు చికిత్సతోపాటు ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా స్నిగ్ధ ఆయుర్వేద ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ గోపాలన్ మాట్లాడుతూ ఆయుర్వేదం భారతీయ ప్రాచీన చికిత్స రూపంలో ఉందని, ఇది ఒక సంస్కృత పదమైన 'ఆయుష్షు' 'వేద' చికిత్స శాస్త్రాన్ని అనుసరిస్తుందని చెప్పారు. ఇది ప్రాకృతిక చికిత్స విధానమైనది, మన శరీరంలో ఉన్న రోగాలను ప్రకతి పరంగా నివారించాలని బోధిస్తుందని వివరించారు. పొత్తూరులోని తమ బ్రాంచిలో ప్రతి బుధ, అదివారంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రూ.10 కన్సల్టేషన్ ఫీజుతో చూస్తామని, మందుల్లో 20 శాతం రాయితీ ఇస్తామని, ఖరీదైన పంచకర్మ చికిత్సలను 50 శాతం రాయితీ ఇస్తున్నామని వివరించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఇటువంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న రోటరీ సేవా కార్యక్రమాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు టి.సతీష్, క్లబ్ డైరెక్టర్లు టి.రామకృష్ణ, వి.వెంకటేశ్వరరావు, పి.రాజశేఖర్, ఎన్.చంద్రశేఖర్, జె.బిక్షారావు, ఎన్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నికో ఆగ్రో కంపెనీ కార్మికులు నిరసన ర్యాలీ

- యాజమాన్యం తీరుపై ఆగ్రహం
- ఏ క్షణమైనా సమ్మెకు దిగుతామని హెచ్చరిక

ప్రజాశక్తి - మేడికొండూరు

తమ సమస్యల పరిష్కారం కోసం నికో ఆగ్రో కంపెనీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో పేరేచర్ల సెంటర్‌లో ఆదివారం రాత్రి నిరసన ప్రదర్శన చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు మాట్లాడుతూ 50 ఏళ్ల చరిత్ర కలిగిన నికో ఆగ్రో కంపెనీలో కార్మికులకు కనీస సౌకర్యాలైన తాగునీరు, క్యాంటీన్, మరుగుదొడ్లు తదితర సదుపాయాలు కల్పించలేకపోవడం యాజమాన్యం యొక్క నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమన్నారు. నిత్యావసర ధరలు పెద్ద ఎత్తున పెరుగుతున్నా కార్మికుల వేతనాలు పెంచే విషయంలో యాజమాన్యం చిన్నచూపు చూడటం సరికాదన్నారు. సమస్యలపై సమ్మె నోటీసు ఇచ్చిన అనంతరం కార్మికుల పట్ల వ్యవహరిస్తున్న కక్ష్య సాధింపు ధోరణులు మానుకోవాలని, తక్షణమే కార్మికులను తొలగిస్తూ ఇచ్చిన లేఖలను బేషరతుగా వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంక్రిమెంట్‌లు పెంచాలన్నారు. యాజమాన్యం స్పందించి కార్మికులతో చర్చలు జరపకుంటే 26వ తారీకు తర్వాత ఏ క్షణమైనా సమ్మెలోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. నిరసనకు కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ మద్దతు తెలిపారు. సిఐటియు సిఐటియు మండల అధ్యక్షులు ఎస్ఎం బాష, నాయకులు బి.రామకృష్ణ, అవాజ్ నాయకులు ఎమ్‌డి సాధిక్, యూనియన్ నాయకులు పి.సుధాకర్‌రెడ్డి, కె.శ్రీనివాస్‌రెడ్డి, అబ్దుల్లా, మీరాసాహెబ్, రహంతుల్లా, జాన్‌పీరా, వెంకటేశ్వర్లు, రవిచంద్రరెడ్డి, డి.విజయ్‌బాబు, రాంబాబు, ఎం.వెంకటేష్, వి.సాంబశివరావు, ఆర్.మహేష్, చలపతి కె.శ్రీనివాసరావు, షేక్.బాజీ, ఆర్.రాజేష్, పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న కార్మికులు సిఐటియు నాయకులు

పల్నాడులో నేటి జగనన్నకు చెబుదాం రద్దు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా కరస్పాండెంట్

పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన 'జగనన్నకు చెబుదాం (స్పందన)' కార్యకమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. పల్నాడు జిల్లాలో సోమవారం నుండి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభం దృష్ట్యా అధికారులంతా ఆయా మండలాలలో జరిగే సర్వే కార్యక్రమాల్లో పాల్గొని పర్యవేక్షించాల్సి ఉందని ప్రకటనలో పేర్కొంది.

విద్యుత్ ప్రమాదాల నివారణకు కృషి

ఉమ్మడి గుంటూరు జిల్లాలో విద్యుత్ ప్రమాదాల నివారణకు ముందస్తుగా అన్నిజాగ్రత్తలు తీసుకునేందుకు ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తత చేస్తున్నట్టు విద్యుత్ శాఖ విజిలెన్సు విభాగం జిల్లా తనిఖీ అధికారి (ఇన్‌స్పెక్టర్) పి.కరుణాకరరావు తెలిపారు. వర్షాకాలం ప్రారంభమైనందున ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా మరింత అప్రమత్తంగా ఉండాలని కోరారు. నివాసాల వద్ద విద్యుత్ వైర్లు వేలాడుతుంటే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని, వర్షాకాలంలో జారిపడిన వైర్లను నేరుగా తాకొద్దని సూచించారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.

- వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- విద్యుత్ అక్రమ వినియోగదార్లపై కేసులు
- ప్రజాశక్తితో జిల్లా విద్యుత్ విజిలెన్స్ అధికారి కరుణాకరరావు

గృహ వినియోగదారులు పాటించాల్సిన జాగ్రత్తలు?

ఇంటికి ఎర్తింగ్ ఇచ్చినప్పుడు కనీసం రెండు ఎర్త్ ఎలక్ట్రోడ్‌లను అమర్చాలి. వివిధ రకాల వస్తువుల వినియోగంలో అసాధారణ శబ్దాలు వచ్చిన వెంటనే నిపుణులతో మరమ్మతు చేయించాలి. ఒకే ప్లగ్ పాయింట్ నుంచి లూజ్ వైర్, తాత్కాలికంగా అనేక పరికరాలకు కనెక్షన్లు ఇవ్వకూడదు. వివిధ రకాల విద్యుత్ ఉపకరణాలు వినియోగించే సమయంలో త్రీపిన్ ప్లగ్‌లను వినియోగించాలి. మూడవ పిన్ను తప్పనిసరిగా ఎర్తింగ్ చేయించాలి. విద్యుత్ షాక్ తగలకుండా ఉండేందుకు ఇళ్లల్లో 30 ఎం యాంప్ సామర్థ్యం కలిగిన ఆర్‌సిసిబి, ఇఎల్‌సిబిలను ఉపయోగించాలి. ప్రమాదాలకు గురైన వ్యక్తిని నేరుగా చేతులతో తాకకుండా కర్రలతో తాకి విద్యుత్ వైరు నుంచి ఆ వ్యక్తిని వేరుచేయాలి. వేలాడుతున్న వైర్లకు దూరంగా ఉండి అధికారులకు తెలియజేయాలి.

పొలాల్లో రైతులు, వ్యవసాయ కూలీలు పాటించాల్సిన జాగ్రత్తలు?

వ్యవసాయ పంపుసెట్లకు సంబంధించి మోటార్లు స్టార్టర్లు స్విచ్చులు ఉన్న ఇనుప బోర్డులను తప్పని సరిగా ఎర్తింగు చేయాలి. తడిచేతులతో, నీటిలో నిలబడి, వర్షంలో స్విచ్చులు వేయరాదు. మోటారు తిరగకపోతే విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు నిమిత్తం నేరుగా ఎక్కకూడదు. పొలాల్లో తెగిపడిన, జారిపడి తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లకు దూరంగా ఉండి సంబంధిత విద్యుత్ సిబ్బందికి, గ్రామ సచివాలయాల ఎనర్జీ సహాయకులకు తెలపాలి. పంట పొలాల్లో పంటను జంతువుల బారి నుంచి రక్షించేందుకు ఏర్పరచిన ఫెన్సింగ్‌లకు విద్యుత్ సరఫరా చేయొద్దు. ఇన్సులేషన్ పాడైన విద్యుత్ వైర్లను ఇన్సులేషన్ టేపుతో చుట్టాలి.

జిల్లాలో ఎన్ని ప్రమాదాలు జరిగాయి?

ఇటీవల కాలంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రజలు, మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. ప్రదానంగా రైతులు పొలాల్లో తగు జాగ్రత్తలు పాటించాలి. 2022లో విద్యుత్ ప్రమాదాల వల్ల జిల్లాలో 103 మంది మనుషులు, 53 పశువులు చనిపోయాయి. 2023లో ఇప్పటి వరకు 33 మంది ప్రజలు, 71 పశువులు చనిపోయాయి. ప్రమాదాల బారినపడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తత చేస్తున్నాం. ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం.

విద్యుత్ అక్రమ వినియోగంపై తీసుకున్నచర్యలు?

విద్యుత్‌ను అక్రమంగా వినియోగించుకుంటున్న వారిపై విద్యుత్ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి కేసులు నమోదు చేస్తారు. సాంకేతికపరమైన అంశాలు శాఖలోని అధికారులు పరిశీలిస్తారు. విద్యుత్ అక్రమంగా వినియోగించే వారికి కోర్టులో శిక్ష పడేలా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

కోస్టల్ కేర్ హాస్పిటల్లో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

స్వర్ణముఖి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోస్టల్‌కేర్ హాస్పిటల్ గత 5 రోజులుగా దుగ్గిరాల కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్‌లో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంప్‌లో మొత్తం 900 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ క్యాంప్‌లో బిపి, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ క్యాంప్‌లో స్వర్ణముఖి ఫౌండేషన్ సభ్యులు, కోస్టల్ కేర్ హాస్పిటల్ డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ క్యాంప్ లో పరీక్షలు చేయించుకున్న వారికి ఓపీ, రక్తపరీక్షలు, మందులు, అడ్మిషన్‌లలో రాయితీ ఉంటుందని, అన్ని రకాల ఆరోగ్య బీమా, సర్జికల్ ప్యాకేజీలు ఉన్నాయన్నారు. ఆతి తకువ కర్చుతో ఆపరేషన్స్ నిర్వహిస్తామని ఆసుపత్రి వైద్యులు తెలిపారు.

రేపు తైక్వాండో సెలక్షన్ ట్రైల్స్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లా తైక్వాండో సెలక్షన్స్ ట్రైల్స్ మంగళవారం ఉదయం 8 బి.ఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ట్రెజరర్ అబ్దుల్ సలాం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో సెలక్షన్ ట్రైల్స్ జరుగుతాయని, క్యాడెట్, జూనియర్ విభాగాల్లో ఈ ట్రైల్స్ ఉంటాయని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హులని, ఆసిక్తి గల వారు 8686240540 నంబరులో సంప్రదించాలని సూచించారు.

మూణ్ణెల్లుగా అందని కందిపప్పు

ప్రజాశక్తి - ఫిరంగిపురం

రేషన్ సరుకుల్లో భాగంగా సరఫరా చేయాల్సిన కందిపప్పును ప్రభుత్వం మూణ్ణెల్లుగా కార్డుదారులకు అందించడం లేదు. మండలంలో 17 పంచాయతీలు ఉండగా వీటి పరిధిలో 20 గ్రామాలున్నాయి. వీటి పరిధిలో వేలాది మంది బియ్యంకార్డుదారులు ఉన్నారు. వీరంతా పేదలే కావడంతో రేషన్ సరుకులపై ఆధారపడి జీవిస్తుంటారు. నిత్యావసర సరుకుల ధరలు పెరిగిన నేపథ్యంలో చాలా కుటుంబాల్లో రేషన్ ద్వారా తీసుకునే బియ్యం, పంచదార, కందిపప్పు కీలకంగా మారాయి. అయితే మూడు నెలల నుండి కందిపప్పు ఇవ్వడం లేదని, అంతకుముందు నాలుగు నెలలు పంచదార ఇవ్వలేదని స్థానికులు చెబుతున్నారు. కందిపప్పుపై రేషన్ వాహనదార్లను అడుగుతుంటే తమకు పైనుండే రావడం లేదని చెబుతున్నారని, ప్రభుత్వం, అధికారులు స్పందించి వాటిని సరఫరా చేయాలని కార్డుదారులు కోరుతున్నారు.